ANN తెలుగు

Follow: @ANNTELUGU

24-10-2026

# మహా పత్రిక

శనివారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 256 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



తుమ్మిడిహెట్టి బ్యారేజీ

## సాధనే లక్ష్యం

పాలమూరు ప్రాజెక్టుకు ఎలాంటి కోత పడొద్దు

- డిండి, అచ్చంపేట ఎత్తిపోతలకు అదనపు నీటి కేటాయింపులు.
- మహారాష్ట్రతో చర్చలకు సర్వసన్నద్ధం.
- సమీక్ష సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి!

**హైదరాబాద్, మహా :** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రైతాంగం చిరకాల వాంఛ అయిన తుమ్మిడిహెట్టి బ్యారేజీ సాధనే ఏకైక లక్ష్యంగా ముందుకువెళ్తున్నట్లు ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.ఈ మేరకు మహారాష్ట్ర ప్రభుత్వంతో త్వరగా జరగబోయే కీలక చర్చలకు సర్వసన్నద్ధం కావాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని ఏ ఒక్క ప్రాజెక్టుకూ అన్యాయం జరగకుండా, ముఖ్యంగా ప్రతిష్ఠాత్మక పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి ఎలాంటి నీటి కోత పడకుండా పకడ్బందీ మిగతా 2వ పేజీలో

టాప్ న్యూస్



### ఏఐతో భారత్‌కు పెను ముప్పు

- మైక్రోసాఫ్ట్ ఏఐ నిపుణుడి హెచ్చరిక
- సైబర్ దాడుల్లో ప్రపంచంలో భారత్ ఏడో టార్గెట్

02



### మెటా గ్లాసెస్‌తో నాపై స్టింగ్ ఆపరేషన్‌కు యత్నం

- కర్ణాటక సీఎం డీకే శివకుమార్ సంచలన ఆరోపణ
- మంత్రులను ఇరికించే ప్రయత్నాలపై అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించినట్లు వెల్లడి

02



### కోడలి గెలుపు కోసం బొత్స సోషల్ మీడియా ప్రచారం

- గరివిడి జడ్పీటీసీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కోడలు బొత్స పూజిత
- గెలిపించాలని ఓటర్లను కోరిన ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ

02



### చిలకలూరిపేటలో తీవ్ర ఉద్రిక్తత

- పోలీసుల అడ్డగింతతో కిందపడ్డ మాజీ మంత్రి విడదల రజిని!

**చిలకలూరిపేట, మహా :** పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో స్థానిక సంస్థల ఎన్నికల వేళ రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. నామినేషన్ల ప్రక్రియలో అధికార కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును నిరసిస్తూ బయటకు వెళ్లేందుకు యత్నించిన వైయస్సార్‌సీపీ అగ్రనేత, మాజీ మంత్రి విడదల రజినిని పోలీసులు గృహనిర్బంధం చేయడం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఆమెను ఇంటి నుంచి బయటకు రాకుండా పోలీసులు అడ్డుకోవడంతో పాటు, నివాస గేటు వద్దే యడ్లపాడు జడ్పీటీసీ అభ్యర్థి బుల్లబ్బాయిని మిగత 3వ పేజీలో

మామా-అల్లుళ్ల మాయమాటలు నమ్మి

# మోసపోవద్దు

క్రోసిన్ వేస్తే కరోనా పోతుందన్న కేసీఆర్ మాటలు నమ్మి మోసపోయాం

- ఇప్పుడు హరీశ్‌రావు మాటలతో మట్టితో అంబలి కాచుకునే పరిస్థితి తెచ్చుకోవద్దు!
- కాంగ్రెస్‌కు ఓటములు కొత్త కాదు.. రెట్టింపు ఉత్సాహంతో మళ్లీ గెలుస్తాం.
- కరువు రాజకీయంపై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం!



**హైదరాబాద్, మహా:** ఎల్‌నినో ముప్పును సైతం రాజకీయ లబ్ధి కోసం వాడుకుంటున్న మామాఅల్లుళ్ల అబద్ధపు ప్రచారాలను తిప్పికొట్టాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల వ్యూహాలపై దిశానిర్దేశం చేయడంతో పాటు, ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతల దిగజారుడు రాజకీయాలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. శుక్రవారం రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో టీపీసీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కీలక సమావేశానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. రాబోయే కాలంలో ఎదురుకానున్న వాతావరణ సవాళ్లు, ఎల్‌నినో ప్రభావంతో తలెత్తబోయే కరువు పరిస్థితులు , ఆరు ఉమ్మడి జిల్లాల పరిధిలోని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై పార్టీ శ్రేణులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. అధికారంలోకి

మిగత 2వ పేజీలో



## సన్నవడ్లకు ఫుల్ డిమాండ్

క్వింటాల్ కు రూ.3500కు పైనే

గత ఏడాదికంటే రూ.వేయి అదనం

కల్లాల వద్దే కొనేస్తున్న వ్యాపారులు

(మహానెట్ వర్క్ )

సన్నవడ్లకు ఈసారి ఫుల్ డిమాండ్ ఏర్పడింది. సర్కారు రూ.500 బోనస్ ఇస్తున్నా ఇవ్వకుండా కల్లాల వల్లే బారులుతీరిన వ్యాపారులకు అధికరేట్లకు రైతులు అమ్మేస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌లో గ్రేడ్‌ఏ ధాన్యానికి కేంద్ర ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.2,461 కనీస మద్దతు ధర నిర్ణయించింది. రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసిన ఏడు రకాల సన్న వడ్లకు దీనికి అదనంగా క్వింటాల్‌కు రూ.500 బోనస్ ప్రకటించింది. అయితే అంతకుమించే.. ప్రైవేట్ వ్యాపారులు చెల్లిస్తూ పోటీలుపడీ మరీ సన్నవడ్లను ఎగరేసుకుపోతున్నారు.

ఓవైపు ఎల్‌నినో ప్రభావం మరోవైపు భూగర్భ జలాలు అడుగంటడంతో పంట దిగుబడులపై మెదక్ జిల్లాలో ప్రతికూల ప్రభావం పడినప్పటికీ సన్న రకం ధాన్యం పండించిన రైతులకు మాత్రం మార్కెట్‌లో మంచి డిమాండ్ లభిస్తోంది. గతంలో వడ్లను అమ్ముకోవాలంటే కొనుగోలు కేంద్రాల వద్ద రోజుల తరబడి పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఉండేది. కానీ ఇప్పుడు ఆ సీన్ పూర్తిగా మారింది. రైతులు కొనుగోలు కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండానే వ్యాపారులే నేరుగా పొలాల వద్దకు వచ్చి ధాన్యం కొనుగోలు చేసి అక్కడికక్కడే నగదు మిగత 2వ పేజీలో



### స్థానిక ఎన్నికల్లో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారు

- సుప్రీంకోర్టు ఆదేశించినా వారి తీరు మారలేదు
- వ్యవస్థలన్నింటినీ పూర్తిగా నిర్వీర్యం చేశారు
- మాజీ సీఎం జగన్ ఆగ్రహం

**విజయవాడ, మహా :** స్థానిక సంస్థల ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం తీవ్రమైన అక్రమాలకు పాల్పడుతోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నామినేషన్లు వేయకుండా వైఎస్సార్‌సీపీ మిగత 3వ పేజీలో

### ఎయిర్‌పోర్ట్ భూసేకరణ మరింత వేగవంతం

- నిర్వాసితులకు సత్వరమే పరిహారం
- సంబంధిత అధికారులు,ఐఏఎఫ్ బృందంతో కలెక్టర్ సమీక్ష
- అధికారులకు పలు ఆదేశాలు

02



దేశ రాజకీయాల్లో కేసీఆర్

### చక్రం తిప్పే రోజులు వస్తున్నాయి

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- కాంగ్రెస్, బీజేపీయేతర కూటమి దేశంలో కీలకపాత్ర పోషించడం ఖాయం

02










## తుమ్మిడిహెట్టి బ్యారేజీ
# సాధనే లక్ష్యం

( మొదటి పేజీ తరువాయి )

చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదే సమయంలో డిండి, అచ్చంపేట ఎత్తిపోతల ప్రాజెక్టులకు అవసరమైన అదనపు నీటిని కేటాయించేలా వ్యూహాత్మకంగా వ్యవహరించాలని సీఎం అధికారులకు దిశానిర్దేశం చేశారు.రాష్ట్రంలో సాగునీటి రంగానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ, కీలక ప్రాజెక్టుల పురోగతిపై శుక్రవారం ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి సచివాలయంలో అత్యున్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క , నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి , మంత్రులు శ్రీ దుద్దిళ్ల శ్రీధర్ బాబు , జూపల్లి కృష్ణారావు , రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి తో పాటు నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ భేటీలో ప్రధానంగా తుమ్మిడిహెట్టి బ్యారేజ్ తో పాటు డిండి, అచ్చంపేట ఎత్తిపోతల ప్రాజెక్టులపై నెలకొన్న పీఠముడి అంశాలపై లోతుగా చర్చించారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి సంబంధించి మహారాష్ట్ర ప్రభుత్వంతో త్వరలో జరిగే చర్చలకు సర్వసన్నద్ధంగా ఉండాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ నెల 23 తర్వాత చర్చలకు ఆహ్వానిస్తానని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఇటీవల సూచనప్రాయంగా తెలియజేసినట్లు సీఎం వెల్లడించారు. ఈ నేపథ్యంలో మహారాష్ట్రతో చర్చల సందర్భంగా తెలంగాణ నీటి అవసరాలను స్పష్టంగా తెలియజేసి, మన వాదనను సమర్థంగా వినిపించాలని మంత్రులకు సూచించారు. ఇటీవల ఢిల్లీలో కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ఆధ్వర్యంలో జరిగిన సమావేశాల వివరాలు, అక్కడ చర్చించిన అంశాలు, సీడబ్ల్యూసీ కోరిన నివేదికలన్నీ వెంటనే సమర్పించాలని అధికారులను ఆదేశించారు.సమీక్షలో భాగంగా తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీని వివిధ ఎత్తుల్లో నిర్మిస్తే జరిగే ప్రయోజనాలు, తలెత్తే ముంపు ప్రభావంపై ఇంజనీరింగ్ అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. బ్యారేజీని 152 మీటర్ల ఎత్తున నిర్మిస్తే ఎల్లంపల్లి వరకు భారీగా నీటిని తరలించే అవకాశం ఉంటుందని, అయితే దీనివల్ల మహారాష్ట్ర పరిధిలో దాదాపు 2,300 ఎకరాల భూములు ముంపునకు గురవుతాయని తెలిపారు. అదే 150 మీటర్ల ఎత్తున నిర్మిస్తే వెయ్యి ఎకరాల లోపే ముంపు ప్రభావం ఉంటుందని వివరించారు. అయితే, మహారాష్ట్ర పరిధిలో ఎక్కడ కూడా ప్రధాన గ్రామాలు ముంపునకు గురికావని స్పష్టం చేశారు. గతంలో 148 మీటర్ల ఎత్తుకు మహారాష్ట్ర అంగీకరించినప్పటికీ, అంత తక్కువ ఎత్తున బ్యారేజీ నిర్మిస్తే ఆశించినంత నీటిని తెచ్చుకునే వీలుండదని సీఎం అభిప్రాయపడ్డారు. మహారాష్ట్రలో ముంపు ప్రభావాన్ని కనీస స్థాయిలో అంచనా వేస్తూనే, తెలంగాణకు గరిష్ఠంగా నీటి లభ్యత ఉండేలా బ్యారేజీని నిర్మించాలని ఆదేశించారు.అటవీ, గిరిజన ప్రాంతం కావడంతో పాటు అత్యంత వెనుకబడిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే తుమ్మిడిహెట్టి బ్యారేజ్ ప్రధాన లక్ష్యమని సీఎం స్పష్టం చేశారు. 'జల్, జంగిల్, జమీన్' నినాదంతో ఏళ్ల తరబడి పోరాడిన అటవీ ప్రాంతవాసులందరికీ ఈ ప్రాజెక్టు ద్వారా మేలు జరగాలని, అదే లక్ష్యాన్ని సాధించే సంకల్పంతో మహారాష్ట్ర ప్రభుత్వంతో సానుకూల చర్చలు జరగాలన్నదే తన ఆకాంక్ష అని చెప్పారు. మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించేందుకు అవసరమైన సాంకేతిక నివేదికలు, నీటి లభ్యత, ముంపు విస్తీర్ణం , ఇతర అంశాలకు సంబంధించిన పూర్తి వివరాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. బ్యారేజీ ఎత్తుపై స్పష్టత వచ్చిన తర్వాత, తుమ్మిడిహెట్టి నుంచి ఎల్లంపల్లి వరకు నీటిని తెచ్చే ప్రాజెక్టు రూట్ డిజైన్లు, భూసేకరణ పనులపై దృష్టి సారించాలని ఇరిగేషన్ ఇంజనీర్లను ఆదేశించారు.డిండి, అచ్చంపేట ఎత్తిపోతల పనులకు అదనపు నీటి కేటాయింపులు మరోవైపు డిండి ప్రాజెక్టు, అచ్చంపేట ఎత్తిపోతల పథకాలకు అవసరమైన నీటి తరలింపుపై కూడా సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. డిండి ప్రాజెక్టుకు ఏదుల రిజర్వాయర్ నుంచి 0.5 టీఎంసీల నీరు, అచ్చంపేట ఎత్తిపోతల పథకానికి 0.1 టీఎంసీల నీటిని లిఫ్ట్ చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారు. ఈ రెండు ప్రాజెక్టులకు అదనంగా అవసరమయ్యే మొత్తం 0.6 టీఎంసీల నీటిని శ్రీశైలం నుంచి సమకూర్చుకోవాలని స్పష్టం చేశారు. శ్రీశైలం, నార్లాపూర్ నుంచి ఏదుల రిజర్వాయర్ వరకు ఈ అదనపు నీటిని లిఫ్ట్ చేసుకునేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నార్లాపూర్ నుంచి లేదా ఏదుల నుంచి డిండికి నీటిని ఎక్కడి నుంచి తీసుకోవాలనే అంశంపై మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాల ప్రజాప్రతినిధుల అభ్యంతరాలు, విజ్ఞప్తులపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా నార్లాపూర్ నుంచి నీటిని తరలిస్తే ఎంత ఖర్చవుతుంది, ఏదుల నుంచి నీటిని తీసుకుంటే ఎంత అంచనా వ్యయం అవుతుందనే వివరాలను అధికారులు వివరించారు. వాటిలోని అనుకూలతలు, ప్రతికూలతలను విశ్లేషించారు. ఎక్కడెక్కడ పంపులు, పంప్‌హౌస్‌లు ఏర్పాటు చేయాలి, ప్రస్తుతం ఉన్న కాల్వలు మరియు సొరంగాల సామర్థ్యం సరిపోతుందా లేదా అనేదానిపై నీటి పారుదల విభాగం వెంటనే అధ్య□నం చేసి తగిన డిజైన్లు తయారు చేసుకోవాలని ఆదేశించారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం నీటి అవసరాలకు ఎలాంటి కోత పడకుండా, పాలమూరు నీటి కేటాయింపులకు ఏమాత్రం ఆటంకం లేకుండా ఏదుల నుంచి డిండి, అచ్చంపేట ప్రాజెక్టులకు నీటిని అందించేలా పనులు చేపట్టాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. మధ్యేమార్గంగా పాలమూరు ప్రాజెక్టు నీటికి ఢోకా లేకుండా డిండి, అచ్చంపేట ఎత్తిపోతలకు అదనపు నీటిని తెచ్చుకునే పనులు చేపట్టాలని సీఎం చేసిన సూచనకు సమావేశంలోని మంత్రులందరూ సంపూర్ణ మద్దతు తెలిపారు. ప్రాజెక్టుల వేగవంతమైన అమలు ద్వారా రైతాంగానికి సాగునీరు అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు.

## మామా-అల్లుళ్ల మాయమాటలు నమ్మి
# మోసపోవద్దు



( మొదటి పేజీ తరువాయి )

వచ్చిన ప్రతీసారీ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న కాంగ్రెస్ పార్టీకి ప్రభుత్వాలను ఏర్పాటు చేయడం కొత్తేమీ కాదని, ఒకట్రెండు సందర్భాల్లో తాత్కాలికంగా ఎదురుదెబ్బలు తగిలినా రెట్టింపు ఉత్సాహంతో తిరిగి పుంజుకున్న చరిత్ర మనదని ఈ సందర్భంగా సీఎం సగర్వంగా గుర్తుచేశారు.రాష్ట్రంలోని ఆరు ఉమ్మడి జిల్లాల పరిధిలో త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలను పార్టీ నాయకులు అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని, క్షేత్రస్థాయిలో పూర్తిగా అప్రమత్తమై శ్రేణులను సమాయత్తం చేయాలని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను, ప్రజా పాలన ఫలాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడంలో పార్టీ యంత్రాంగం మరింత చురుగ్గా వ్యవహరించాలని ఆయన సూచించారు. ఇదే సమయంలో రాష్ట్రంలో కరువు పరిస్థితులపై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న దుష్ప్రచారాలపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కరువు ప్రారంభమైనప్పుడు దాని తీవ్రత వెంటనే తెలియదని, రోజులు గడిచే కొద్దీ దాని ప్రభావం అత్యంత తీవ్రరూపం దాల్చుతుందని విశ్లేషించారు. దీన్ని కూడా రాజకీయ లబ్ధి కోసం వాడుకుంటూ కాంగ్రెస్ తెచ్చిన కరువని కొందరు అసంబద్ధ ఆరోపణలు చేస్తున్నారని, అలా మాట్లాడటానికి ఆ మామాఅల్లుళ్లు అంతటి తెలివైనవారా అని తీవ్రస్థాయిలో ఎద్దేవా చేశారు. కేవలం తెలంగాణలోనే కాకుండా పొరుగున ఉన్న మహారాష్ట్రలోనూ తీవ్రమైన కరువు పరిస్థితులు నెలకొన్నాయని, అక్కడ కొన్ని ప్రాంతాల్లో ఏకంగా రేషన్‌షాపుల ద్వారా తాగునీటిని సరఫరా చేయాల్సిన దుస్థితి దాపురించిందని ఆయన గుర్తుచేశారు. ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో రాబోయే ఎండల తీవ్రతను, తాగునీటి ఎద్దడిని ముందే అంచనా వేసి అందరూ అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. గతంలో కరోనా మహమ్మారి విలయం సృష్టించిన సమయంలో 'క్రోసిన్ వేసుకుంటే కరోనా పోతుంది' అంటూ కేసీఆర్ చెప్పిన అశాస్త్రీయ మాటలను నమ్మి ఎంతోమంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారని ఆయన తీవ్రంగా ధ్వజమెత్తారు. అదేవిధంగా, ప్రస్తుతం హరీష్‌రావు మాటలు నమ్మి రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దని, ఒకవేళ వారి మాటలు నమ్మి మోసపోతే భవిష్యత్తులో మట్టితో అంబలి కాచుకునే దయనీయ పరిస్థితి వస్తుందని ఆయన ఘాటుగా హెచ్చరించారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం మరియు ప్రధాని నరేంద్ర మోదీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గళమెత్తారు. ఓటు హక్కుపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు అప్పట్లో ఎస్ఐఆర్ విధానాన్ని తీసుకొచ్చినప్పటికీ, నేడు ప్రధాని మోదీ తన స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం దానిని పూర్తిగా దుర్వినియోగం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఎస్ఐఆర్ పేరుతో నిరుపేదల ప్రాథమిక హక్కులను కాలరాసే కుట్ర జరుగుతోందని, ఈ విధానం ద్వారా లబ్ధి పొందాలని మోదీ సర్కార్ సర్వశక్తులూ ఒడ్డుతోందని ఆయన తీవ్రంగా విమర్శించారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ, ప్రభుత్వ సంక్షేమ ఫలాలను ప్రజలకు వివరిస్తూ రాబోయే ఎన్నికల్లో ఘన విజయం సాధించడమే లక్ష్యంగా కాంగ్రెస్ శ్రేణులు సైనికులా పనిచేయాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.



## మెటా గ్లాసెస్‌తో నాపై స్టింగ్ ఆపరేషన్‌కు యత్నం

**బెంగళూరు, మహా :** తనతో పాటు కేరళ సీఎం వీడీ సతీశన్‌ను లక్ష్యంగా చేసుకుని స్టింగ్ ఆపరేషన్ చేసేందుకు ప్రయత్నించారని కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆరోపించారు. బీజేపీ, ఎన్డీయే కూటమి ముఖ్యమంత్రులపై కాకుండా కాంగ్రెస్ నేతలనే లక్ష్యంగా చేసుకున్నారని ఆయన పేర్కొన్నారు. కన్నడ వార్తా ఛానల్ ఏషియానెట్ సువర్ణ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ ఆరోపణలు చేశారు.ఓ పారిశ్రామికవేత్త తనను కలిసేందుకు వచ్చినప్పుడు మెటా స్మార్ట్ గ్లాసెస్ ధరించి ఉండటంతో అనుమానం కలిగిందని డీకే శివకుమార్ తెలిపారు. అధికారుల ద్వారా అపాయింట్‌మెంట్ తీసుకున్న ఆ వ్యక్తి తొలుత వ్యాపార విషయాలు మాట్లాడారని, ఆ తర్వాత రాజకీయాలు, బూత్ స్థాయి వ్యూహాలు, రాజకీయ పరిణామాల గురించి చర్చ మొదలుపెట్టారని చెప్పారు. దీంతో ఆ వ్యక్తి నేపథ్యంపై విచారణ చేయాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. ఆ విచారణలో తనకు అందిన సమాచారం ప్రకారం.. ఆ పారిశ్రామికవేత్త కేరళ సీఎం వీడీ సతీశన్‌ను కలిసినప్పుడు కూడా అదే మెటా గ్లాసెస్ ధరించారని డీకే తెలిపారు. అయితే ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబును, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ ను, ఓ కేంద్ర మంత్రిని కలిసినప్పుడు మాత్రం వాటిని ధరించలేదని పేర్కొన్నారు. “ఆ వ్యక్తి నా దగ్గరకు, సతీశన్ దగ్గరకు వచ్చినప్పుడే మెటా గ్లాసెస్ పెట్టుకున్నాడు” అని డీకే శివకుమార్ అన్నారు. అయితే ఆ పారిశ్రామికవేత్త పేరును వెల్లడించలేదు. రహస్యంగా చిత్రీకరించేందుకు ప్రయత్నించినట్లు నిర్ధారించే ఆధారాలను కూడా ఇంటర్వ్యూలో బయటపెట్టలేదు. ఈ వ్యవహారంపై చర్యలు తీసుకోలేదన్న ప్రశ్నకు స్పందిస్తూ.. తాము అవసరమైన జాగ్రత్తలు తీసుకున్నామని, అయితే ఆ వివరాలను వెల్లడించడం లేదని చెప్పారు. తనకు అనుమానితుల గురించి సమాచారం అందిందని, మంత్రులు వ్యక్తిగత సహాయకులు, ఫోన్ కాల్స్ తదితర మార్గాల ద్వారా జరిగే ఉచ్చులో పడకుండా అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించినట్లు తెలిపారు. “మంత్రులు అప్రమత్తంగా ఉండాలని, మోసపోవద్దని చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వాధినేతగా నాపై ఉంది” అని డీకే అన్నారు. ఈ వ్యవహారంలో ప్రమేయం ఉన్నవారి పేర్లు, పత్రాలను సరైన సమయంలో బయటపెడతానని, ప్రస్తుతం వాటిని వెల్లడించే సమయం కాదని పేర్కొన్నారు.

**పదిమంది టార్గెట్ గా**

అక్టోబర్ 8న జరిగిన కేబినెట్ సమావేశంలో, మంత్రులను స్టింగ్ ఆపరేషన్ల ద్వారా ఇరికించే ప్రయత్నాలు జరగవచ్చని డీకే హెచ్చరించినట్లు సమాచారం. సుమారు పది మంది మంత్రులు, ముఖ్యమంత్రి కార్యాలయాన్ని లక్ష్యంగా చేసుకునేందుకు ఓ కేంద్ర మంత్రి, కర్ణాటక బీజేపీ నేత ప్రైవేటు ఏజెన్సీకి నిధులు సమకూర్చారని కాంగ్రెస్ ఎమ్మెల్యే రవి కుమార్ గణిగ ఆరోపించారు. ఇందుకు సంబంధించిన ఆధారాలు ఉన్న పెన్‌డ్రైవ్ తన వద్ద ఉందని చెప్పారు. మరోవైపు, వివాదాస్పద వీడియోల ప్రసారాన్ని అడ్డుకోవాలని కోరుతూ సిద్ధరామయ్య బెంగళూరు కోర్టును ఆశ్రయించారు. పోలీసు విచారణ కూడా కోరారు. అక్టోబర్ 14న రెండు వీడియోల ప్రసారాన్ని నిలిపివేస్తూ మీడియా సంస్థలు, డిజిటల్ వేదికలకు కోర్టు మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. వీడియోల తయారీ, ప్రచారంపై పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది.

# సన్నవడ్లకు ఫుల్ డిమాండ్

( మొదటి పేజీ తరువాయి )

ముట్టచెబుతున్నారు. దీంతో రవాణా ఖర్చులు తగ్గడంతో పాటు, రోజుల తరబడి ఎదురుచూసే బాధలూ తప్పాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**సన్న వడ్లను ప్రోత్సహించిన రేవంత్ సర్కార్**

రాష్ట్రవ్యాప్తంగా సన్న వడ్లు పండించిన రైతన్నకు ఈసారి మార్కెట్‌లో మంచి గిరాకీ కనిపిస్తోంది. ధాన్యం నాణ్యతగా ఉంటే చాలు కొనుగోలు చేసేందుకు వ్యాపారులే రైతుల వద్దకు క్యూ కడుతున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు మహారాష్ట్రకు చెందిన పలువురు వ్యాపారులు నేరుగా గ్రామాల్లోని పొలాల వద్దకు వచ్చి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. మెదక్ జిల్లాలోని పలు గ్రామాల్లో గ్రేడ్‌ఏ సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.3,300 నుంచి రూ.3,500 వరకు ధర పలుకుతుందని రైతులు ఆనందంతో చెబుతున్నారు. గతేడాదితో పోలిస్తే క్వింటాల్‌కు సుమారు రూ.1000 వరకు అదనంగా లభిస్తుండటంతో అన్నదాతలు ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఈసారి పంట దిగుబడి తగ్గినప్పటికీ ధర కొంత ఎక్కువగా వస్తుండటంతో నష్టాల బారిన పడకుండా తప్పించుకోగలిగామని చెబుతున్నారు. గతంలో వరి కోతలు మొదలైనప్పటి నుంచి రైతులకు పరీక్ష మొదలయ్యేది. ధాన్యాన్ని ట్రాక్టర్ల ద్వారా కొనుగోలు కేంద్రాలకు తరలించడం. అక్కడ కుప్పలు పోసి కాంటా కోసం రోజుల తరబడి ఆరబెట్టి ఎదురుచూడటం. అకాల వర్షాలు వస్తాయేమోనని ఆందోళన చెందడం. ధాన్యాన్ని కాపాడుకునేందుకు తంటాలు పడాల్సి వచ్చేది. చివరకు ధాన్యం అమ్మిన తర్వాత డబ్బులు ఎప్పుడు ఖాతాలో పడతాయోనని బ్యాంకుల చుట్టూ తిరగడం జరిగేది. కానీ ఈసారి పరిస్థితి కొంత భిన్నంగా మారింది. పంట కోతలు పూర్తికాకముందే వ్యాపారులే పొలాల వద్దకు చేరుకుని ధాన్యం కొనుగోలు చేస్తుండటంతో రైతులకు ఖర్చులు కలిసోస్తున్నాయి. కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు కాయాల్సిన పరిస్థితి తప్పిందని రైతులు చెబుతున్నారు. దిగుబడులపై ప్రకృతి ప్రభావం చూపినా, సన్న వడ్లకు పెరిగిన డిమాండ్ రైతులకు కొంత ఊరటనిస్తోంది. కొనుగోలు కేంద్రాల వద్ద నిరీక్షణకు బదులు పొలాల వద్దకే వస్తున్న వ్యాపారులు, తగ్గుతున్న అదనపు ఖర్చులు రైతుల్లో కొత్త ఉత్సాహం నింపుతోంది.



# ఎయిర్‌పోర్ట్ భూసేకరణ మరింత వేగవంతం

- నిర్వాసితులకు సత్వరమే పరిహారం
- సంబంధిత అధికారులు,ఐఏఎఫ్ బృందం తో కలెక్టర్ సమీక్ష
- అధికారులకు పలు ఆదేశాలు

**ఆదిలాబాద్ మహా:** జిల్లాలో ప్రతిపాదిత విమానాశ్రయ విస్తరణకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను ఎలాంటి జాప్యానికి తావులేకుండా పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. భూసేకరణకు సంబంధించిన పెండింగ్ అంశాలను త్వరితగతిన పరిష్కరించి, క్షేత్రస్థాయిలో పనులు నిర్దేశిత ప్రణాళిక ప్రకారం ముందుకు సాగేలా చర్యలు చేపట్టాలని సూచించారు.శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ (ఐ ఎ ఎఫ్) పర్యవేక్షక బృందంతో కలిసి ఎయిర్‌పోర్ట్ భూసేకరణ పనుల పురోగతిపై కలెక్టర్ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. విమానాశ్రయ విస్తరణకు అవసరమైన భూమి వివరాలు, ఇప్పటివరకు చేపట్టిన సర్వే, భూసేకరణ పురోగతి, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలు తదితర అంశాలపై అధికారులతో చర్చించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విమానాశ్రయ అభివృద్ధిలో భూసేకరణ ప్రక్రియ అత్యంత కీలకమైనదని పేర్కొన్నారు. సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ భూసేకరణకు సంబంధించిన అన్ని అంశాలను నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో నిర్వహిస్తున్న భూ సర్వే పనులను పకడ్బందీగా చేపట్టాలని, సర్వే సమయంలో ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైన వివరాలను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో సేకరించి, ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. విమానాశ్రయ విస్తరణ కోసం భూములు కోల్పోతున్న నిర్వాసితుల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని కలెక్టర్ తెలిపారు. నిబంధనల ప్రకారం అర్హత కలిగిన ప్రతి భూ నిర్వాసితుడికి అందాల్సిన పరిహారం, పునరావాస ప్రయోజనాలు సత్వరమే అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూసేకరణ ప్రక్రియలో పారదర్శకత పాటించాలని, భూములకు సంబంధించిన రికార్డులు, హక్కులు, ఇతర వివరాలను నిశితంగా పరిశీలించి అర్హులైన వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.భూసేకరణకు సంబంధించి ఇప్పటివరకు చేపట్టిన సర్వే, భూముల వివరాల సేకరణ, క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులు, పరిష్కరించాల్సిన అంశాలపై జిల్లా స్థాయి అధికారులు, రెవెన్యూ సిబ్బంది కలెక్టర్‌కు వివరించారు. భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసేందుకు చేపడుతున్న చర్యలను తెలియజేశారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఎయిర్‌ఫోర్స్ పర్యవేక్షక బృందం సభ్యులు కెప్టెన్ రాకేష్, ఎస్.ఆర్. సింగ్, ఆర్డీవో జగదీశ్వర్‌రావు, ల్యాండ్ సర్వే ఆర్‌ఏడీ ప్రభాకర్, మున్సిపల్ కమిషనర్ జగదీష్ గౌడ్, సంబంధిత శాఖల అధికారులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఏఐతో భారత్‌కు పెను ముప్పు

**మైక్రోసాఫ్ట్ ఏఐ నిపుణుడి హెచ్చరిక**

**మహా :** సైబర్ దాడుల విషయంలో భారత్‌కు పెను ప్రమాదం పొంచి ఉందని టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ ఏఐ, సైబర్‌సెక్యూరిటీ పాలసీ డైరెక్టర్ నికోలస్ బట్స్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రపంచవ్యాప్తంగా సైబర్ దాడులకు అత్యధికంగా గురవుతున్న దేశాల్లో భారత్ ఏడో స్థానంలో ఉండగా, ఆసియాలో మూడో స్థానంలో ఉందని ఆయన తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాయంతో ఈ దాడుల తీవ్రత మరింత పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఢిల్లీలో జరిగిన 'ఎన్డీటీవీ వరల్డ్ సమ్మిట్ 2026'లో ఆయన ఈ కీలక విషయాలు వెల్లడించారు. "భారత్‌కు ముప్పు చాలా వాస్తవమైనది. ఇది పదేళ్ల తర్వాత జరగబోయే ప్రమాదం కాదు, ప్రస్తుతం మనం ఎదుర్కొంటున్న భద్రతా సవాలు" అని ఆయన నొక్కిచెప్పారు. తాము ప్రతిరోజూ 165 ట్రిలియన్ల టెలిమెట్రీ సిగ్నళ్లను విశ్లేషిస్తామని, 5 మిలియన్ల కొత్త మాల్‌వేర్‌లను అడ్డుకుంటామని, అందుకే తమకు ఈ ముప్పుపై స్పష్టమైన అవగాహన ఉందని వివరించారు. భారత్‌కు పొంచి ఉన్న మూడు ప్రధాన ముప్పుల గురించి బట్స్ వివరిస్తూ, "చైనా కేంద్రంగా పనిచేస్తున్న 'స్టార్మ్ 3168' అనే రాన్సమ్‌వేర్ సంస్థ, ఏఐ ఏజెంట్లను ఉపయోగించి దాడులకు పాల్పడుతోంది. అలాగే, డేటా దొంగతనం, గూఢచర్యం లక్ష్యంగా చైనా ప్రభుత్వ ప్రేరేపిత 'స్టార్మ్ 0940' పనిచేస్తోంది" అని తెలిపారు. వీటితో పాటు, 'ఈవిల్‌టోకెన్స్' అనే సైబర్ ముఠా ఏఐ టూల్స్‌ను కేవలం 1,500 డాలర్లకే అమ్ముతోందని, దీనివల్ల 120 దేశాల్లో 10,000కు పైగా సంస్థలు ప్రభావితమయ్యాయని బట్స్ పేర్కొన్నారు. ఏఐని ఉపయోగించుకుని సైబర్ నేరగాళ్లు మరింత శక్తివంతంగా మారుతున్నారని తెలిపారు.

## కోడలి గెలుపు కోసం బొత్స సోషల్ మీడియా ప్రచారం

- గరివిడి జడ్పీటీసీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కోడలు బొత్స పూజిత
- గెలిపించాలని ఓటర్లను కోరిన ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ

**విజయనగరం, మహా :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సీనియర్ నేత, శాసనమండలి ప్రతిపక్ష నాయకుడు, వైసీపీ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ తన కుటుంబం నుంచి మరో రాజకీయ వారసురాలిని రంగంలోకి దించారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో, తన కోడలు బొత్స పూజితను గరివిడి మండల జడ్పీటీసీ అభ్యర్థిగా బరిలోకి దింపారు. ఆమెను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరుతూ ఆయన సోషల్ మీడియా వేదికగా ఓటర్లకు స్వయంగా విజ్ఞప్తి చేశారు. తమ కుటుంబం ఎల్లప్పుడూ ప్రజాసేవకే అంకితమై ఉందని, అదే స్ఫూర్తితో తన కోడలు పూజిత సైతం మండల ప్రజల సమస్యల పరిష్కారానికి, ప్రాంతాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తారని బొత్స తన పోస్ట్‌లో పేర్కొన్నారు. "పూజితను మీ ఇంటి ఆడబిడ్డగా భావించి, ఓటు వేసి ఆశీర్వదించండి" అని ఆయన ఓటర్లను కోరారు. ఈ సందర్భంగా బొత్స పూజిత ఫోటోతో కూడిన ప్రచార పోస్టర్‌ను కూడా ఆయన పంచుకున్నారు. ఈ పోస్టర్‌లో బొత్స పూజిత సంప్రదాయబద్ధమైన వస్త్రధారణతో నమస్కరిస్తున్నట్లుగా ఉండగా, పైభాగంలో వైసీపీ ముఖ్య నేతల ఫోటోలను, కింది భాగంలో పార్టీ గుర్తు 'ఫ్యాన్'ను స్పష్టంగా పొందుపరిచారు. సీనియర్ నేతగా తనకున్న రాజకీయ పలుకుబడి, బలమైన కుటుంబ నేపథ్యంతో బొత్స తన కోడలిని రాజకీయాల్లోకి తీసుకురావడం ప్రస్తుతం స్థానికంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ పరిణామంతో గరివిడి మండలంలో ఎన్నికల ప్రచారం మరింత ఊపందుకుంది.




## వందేమాతరం పూర్తి గేయంపై సుప్రీంకోర్టులో పిటిషన్

**న్యూఢిల్లీ, మహా:** ప్రభుత్వ, విద్యా కార్యక్రమాల్లో ఆరు చరణాల వందేమాతరం గేయాన్ని ఆలపించాలంటూ కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ కేరళకు చెందిన మాజీ ఐఏఎస్ అధికారి బాలకృష్ణన్ సత్యభామ మావోజీ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ ఉత్తర్వులు రాజ్యాంగంలోని లౌకిక స్ఫూర్తికి, మత స్వేచ్ఛకు విరుద్ధంగా ఉన్నాయని పిటిషన్‌లో పేర్కొన్నారు. వందేమాతరం తొలి రెండు చరణాలకే మతపరమైన వివాదాలు లేవని, వాటినే అధికారికంగా గుర్తించాలని కోరారు. పూర్తి గేయాన్ని తప్పనిసరిగా ఆలపించాలనే ఆదేశాలను రద్దు చేయడంతోపాటు, వ్యక్తిగత మత విశ్వాసాల కారణంగా ఆలపించని వారిపై బలవంతపు చర్యలు తీసుకోకుండా ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ, నిర్ణయం వెలువడాల్సి ఉంది.



## రూ.382 కోట్లతో ఐదు ప్రాజెక్టులకు
# అనుమతులుమంజూరు

**సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి**

**హనుమకొండ, మహా :** హైదరాబాద్ తర్వాత వరంగల్ నగరాన్ని అభివృద్ధి చేస్తానని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీకి అనుగుణంగా, నగర అభివృద్ధికి రూ.382 కోట్ల అంచనా వ్యయంతో ఐదు కీలక ప్రాజెక్టులకు రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా అనుమతులు కుడా కు మంజూరు చేయడం పట్ల కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి కుడా, వరంగల్ ప్రజల తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. వరంగల్ చారిత్రక వైభవాన్ని కాపాడుతూ, ఆధునిక మౌలిక సదుపాయాలతో నగరాన్ని అభివృద్ధి చేయాలన్న ప్రభుత్వ సంకల్పానికి ఈ అనుమతులు నిదర్శనమని ఆమె పేర్కొన్నారు. కుడా ఆధ్వర్యంలో వరంగల్ కోట కందకాల పునరుద్ధరణ, హనుమకొండ సెంట్రల్ ప్లాజా అభివృద్ధి, ఇంటిగ్రేటెడ్ బస్ టెర్మినల్ కమ్ కమర్షియల్ కాంప్లెక్స్, వేయి స్తంభాల గుడి పరిసరాల్లో అభివృద్ధి పనులు, మ్యూజికల్ గార్డెన్ ఏర్పాటు వంటి ప్రాజెక్టులు నగరానికి కొత్త రూపురేఖలను తీసుకురానున్నాయని తెలిపారు. వీటితో పర్యాటక రంగం అభివృద్ధి చెందడమే కాకుండా, వాణిజ్య కార్యకలాపాలు, స్థానిక ఉపాధి అవకాశాలకు మరింత ఊతం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ అభివృద్ధి ప్రాజెక్టుల నిధుల మంజూరు కు సహకరించిన ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డికి, రాజ్యసభ ఎంపీ వేం నరేందర్ రెడ్డికి, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య కు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి, కుడా వైస్ చైర్‌పర్సన్ కు, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద కు గుండు సుధారాణి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషి చేయడం వల్ల నగర అభివృద్ధి లక్ష్యాలను మరింత వేగంగా సాధించగలమని పేర్కొన్నారు. వరంగల్ అభివృద్ధిపై ముఖ్యమంత్రి చూపుతున్న ప్రత్యేక చొరవ నగర ప్రజల్లో కొత్త ఆశలను నింపుతోందని, నగరానికి ఇచ్చిన హామీకి అనుగుణంగా కీలక ప్రాజెక్టులకు అనుమతులు మంజూరు చేయడం పట్ల వారికి మన స్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేస్తున్నానని తెలిపారు. ఈ ప్రాజెక్టులు సాకారమై వరంగల్ నగర చారిత్రక వారసత్వాన్ని కాపాడుకుంటూ, ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చెందిన నగరంగా రూపు దిద్దుకోవాలని ఆకాంక్షిస్తున్నానని అని కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి తెలిపారు.

# స్థానిక ఎన్నికల్లో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారు

( మొదటి పేజీ తరువాయి )

అభ్యర్థులను భౌతికంగా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంలో రాష్ట్ర ఎన్నికల సంఘం, పోలీసుల పాత్రపై తీవ్ర సందేహాలు వ్యక్తం చేశారు. శుక్రవారం తాడేపల్లిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన, వ్యవస్థలన్నీ పూర్తిగా వీధిపాలయ్యాయని మండిపడ్డారు.



**సుప్రీంకోర్టు చీవాట్లు పెట్టినా మార్పు లేదు**

స్థానిక పోరులో జరుగుతున్న అక్రమాలపై తాము అన్ని ఆధారాలతో అధికారులను, రాజ్యాంగ వ్యవస్థలను ఆశ్రయించామని జగన్ స్పష్టం చేశారు. "స్థానిక సంస్థల ఎన్నికల్లో జరుగుతున్న దారుణాలను, అక్రమాలను నిరంతరం ప్రజాక్షేత్రంలో ఉంచుతున్నాం. మేము సేకరించిన ప్రతి ఆధారాన్ని రాష్ట్ర ఎన్నికల కమిషన్, గౌరవ గవర్నర్ మరియు సుప్రీంకోర్టుకు సమర్పించాం," అని ఆయన తెలిపారు. తాము సమర్పించిన ఆధారాలను పరిశీలించిన తర్వాత సుప్రీంకోర్టు సైతం రాష్ట్ర ప్రభుత్వానికి, ఎన్నికల సంఘానికి తీవ్రంగా చీవాట్లు పెట్టిందని జగన్ గుర్తుచేశారు. "మా ఆధారాలను పరిశీలించిన తర్వాత సుప్రీంకోర్టు ఎన్నికల సంఘాన్ని, ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీసింది. కానీ నామినేషన్లు వేయడానికి వస్తున్న అభ్యర్థులను భౌతికంగా అడ్డుకోవడం దేనికి సంకేతం...? రాష్ట్రంలో వ్యవస్థలు పూర్తిగా కూలిపోయాయి, దిగజారిపోయాయి అనడానికి ఇది ప్రత్యక్ష నిదర్శనం కాదా...? కేవలం నామినేషన్లు వేయకుండా ఆపడానికేనా ఈ హైడ్రామాలు....?" అని మాజీ సీఎం ప్రశ్నించారు. అభ్యర్థులు స్వేచ్ఛగా నామినేషన్లు దాఖలు చేసేలా వాతావరణాన్ని కల్పించాలని, ఎన్నికల ప్రక్రియ నిష్పాక్షికంగా సాగేలా చూడాలని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించిందని జగన్ వివరించారు. "మేము అందించిన జాబితా ఆధారంగా అభ్యర్థులు నామినేషన్లు వేసేందుకు పూర్తి సహకారం అందించాలని, స్వేచ్ఛగా ఎన్నికలు నిర్వహించాలని సుప్రీంకోర్టు స్పష్టంగా ఆదేశించింది. అందరినీ నామినేషన్లు వేయనిస్తే, అందరం కలిసి ప్రజల వద్దకు వెళ్తాం, వారి ఆశీస్సులు కోరతాం. కానీ ఇలా నామినేషన్లను అడ్డుకోవడం అంటే ప్రజలు ఇచ్చిన ప్రజాస్వామ్య తీర్పును బుల్డోజ్ చేయడమే," అని ఆయన ఆక్రోశం వ్యక్తం చేశారు.

**కేవలం 4 చోట్లే అనుమతా....?**

అత్యున్నత న్యాయస్థానం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ, వాటి అమలులో ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని జగన్ మండిపడ్డారు. అభ్యర్థులను అడ్డుకున్న 19 మున్సిపాలిటీల్లో కేవలం నాలుగు చోట్ల మాత్రమే నామినేషన్లను ఎందుకు స్వీకరించారని ఆయన నిలదీశారు. "సుప్రీంకోర్టు హెచ్చరించిన తర్వాత కూడా చంద్రబాబులో మార్పు వచ్చిందా? ఎస్ఈసీ మారిందా? డీజీపీ ప్రవర్తనలో మార్పు ఉందా? మీకు అత్యున్నత కోర్టు అంటే అసలు గౌరవం ఉందా? నామినేషన్లు అడ్డుకున్న 19 మున్సిపాలిటీలలో కేవలం నాలుగింటిలోనే ఎందుకు అంగీకరించారు? రాష్ట్ర ఎన్నికల సంఘం సుప్రీంకోర్టు ఉత్తర్వులను పాటిస్తోందా లేక చంద్రబాబు ఇచ్చే ఆదేశాలను అమలు చేస్తోందా?" అని ఆయన నేరుగా ప్రశ్నించారు. ఎన్నికల వ్యవస్థను చంద్రబాబు తన స్వార్థ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారని ఆరోపించిన జగన్ ఆయనను మహాభారతంలో శకుని పాత్రతో పోల్చారు. నిబంధనలను తనకు నచ్చినట్లు మారుస్తున్నారని విమర్శించారు. "మన ఎన్నికల వ్యవస్థలో చంద్రబాబు శకుని పాత్ర పోషిస్తున్నారు. తన సొంత ప్రయోజనాలకు అనుగుణంగా నిబంధనలను సవరిస్తున్నారు. నామినేషన్ల దశలోనే ఈ స్థాయిలో అక్రమాలకు, అరాచకాలకు పాల్పడుతుంటే రేపు పోలింగ్, ఓట్ల లెక్కింపు సమయంలో ఇంకెన్ని దారుణాలు చేస్తారో ఊహించుకోవచ్చు!" అని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వ పనితీరు ఆధారంగా ఓట్లు అడిగే ధైర్యం చంద్రబాబుకు ఉందా అని జగన్ సవాల్ విసిరారు. తమ హయాంలో చేసిన మంచి పనులను చూపే 86 శాతం విజయాలను సాధించామని గుర్తుచేశారు.

"చంద్రబాబు నిజంగానే ప్రజలకు మంచి చేసి ఉంటే, తన పాలనా రికార్డును చూపించి ప్రజల ముందుకు వెళ్లాలి. మా పాలనలో మేము చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూపించే 86 శాతం స్థానిక సంస్థల విజయాన్ని సాధించాం. కానీ ఈరోజు ఈ ప్రభుత్వ పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు, అందుకే కూటమి నాయకులు దిగజారి దొంగ దారుల్లో గెలవాలని చూస్తున్నారు. బీహార్ కంటే దారుణంగా రక్తం చిందించే కల్చర్‌ను ఇక్కడ ప్రోత్సహిస్తున్నారు. పోలీసుల కళ్లముందే అభ్యర్థులపై దాడులు జరుగుతున్నాయి. అక్రమాలకు సహకరిస్తున్న పోలీసు అధికారులు, అధికారులను బాధ్యతల నుంచి తప్పించకుండా ఎన్నికలు స్వేచ్ఛగా, పారదర్శకంగా ఎలా జరుగుతాయి?" అని ఆయన ప్రశ్నించారు. గతంలో బూత్ రిగ్గింగ్‌లకు పాల్పడిన చంద్రబాబు ఇప్పుడు ఏకంగా నామినేషన్ సెంటర్లనే రిగ్గింగ్ చేసే స్థాయికి దిగజారారని జగన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఎనిమిది రకాల కుట్రలతో రాష్ట్రాన్ని చితిలా మారుస్తున్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని విధ్వంసం చేస్తుంటే చూస్తూ ఊరుకోబోమనియయయయ న్యాయం జరిగే వరకు ప్రతి ఇంటి గుమ్మం తొక్కుతామని, ప్రతి కోర్టు తలుపు తడతామని వైఎస్ జగన్ స్పష్టం చేశారు.



# చిలకలూరిపేటలో తీవ్ర ఉద్రిక్తత

( మొదటి పేజీ తరువాయి )

కూడా నిలిపివేయడం కలకలం రేపింది. ఈ క్రమంలో పోలీసుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన రజినికి, అధికారులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది.

తన వారిని ఇంట్లోకి ఎందుకు అనుమించడం లేదని మాజీ మంత్రి విడదల రజిని పోలీసులను నిలదీశారు. ఈ సమయంలో పరిస్థితి మరింత ఉద్రిక్తతంగా మారింది. చిలకలూరిపేట రూరల్ ఎస్సై ప్రియాంక ఆమెను అడ్డుకునేందుకు యత్నించగా, ఇరువర్గాల మధ్య జరిగిన తోపులాటలో మాజీ మంత్రి రజిని కిందపడిపోయారు. వైయస్సార్‌సీపీ అభ్యర్థులను ఎక్కడికక్కడ నామినేషన్లు వేయకుండా అడ్డుకుంటున్నారని, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని ఈ సందర్భంగా ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తూ అధికార పార్టీకి కొమ్ముకాయడం సరికాదని మండిపడ్డారు.

**కూటమి ప్రభుత్వంపై విడదల రజిని తీవ్ర విమర్శలు**

ఇదిలా ఉండగా, అంతకుముందు గురువారం మీడియాతో మాట్లాడిన విడదల రజిని కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. చిలకలూరిపేట నియోజకవర్గంలో టీడీపీ గూండాలు బరితెగించి నామినేషన్లకు వెళ్తున్న వైయస్సార్‌సీపీ అభ్యర్థులపై భౌతిక దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇళ్లలోకి దూరి మరీ అభ్యర్థులను లాక్కొచ్చి నామినేషన్లు విత్‌డ్రా చేయిస్తుంటే రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) ఏం చేస్తోందని ఆమె నిలదీశారు. చిలకలూరిపేటలో టీడీపీ దాడులకు దిగుతుంటే, బెదిరించి నామినేషన్లు రద్దు చేయిస్తున్నా పోలీసులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారని ఆక్షేపించారు. అర్ధరాత్రి 12 గంటల వరకు మున్సిపల్ ఎన్నికల నామినేషన్లు విత్‌డ్రా చేయించిన అక్రమాలపై ఎస్ఈసీని కలిసి పూర్తి ఆధారాలు సమర్పించామని, దీనిపై తగు చర్యలు తీసుకోకపోతే సుప్రీంకోర్టును ఆశ్రయించి న్యాయం కోరతామని రజిని గట్టిగా హెచ్చరించారు.

రాష్ట్రంలో 'రెడ్ బుక్ రాజ్యాంగం' అమలు చేస్తూ స్థానిక ఎన్నికల్లో దాడులు, అరాచకాలకు పాల్పడుతున్న వైనం అందరూ చూస్తున్నారని రజిని విమర్శించారు. ఈ రెడ్ బుక్ ఎలక్షన్ అజెండా ఒక్కటేనని, కూటమి అభ్యర్థులు కనీసం పోటీ కూడా పడకుండానే వారే సుప్రీం అనుకుని ఏకగ్రీవం కావాలని డిక్లరేషన్ చేసుకోవడమే ఈ విధానం ఉద్దేశమని ఎద్దేవా చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడ చూసినా విపక్ష అభ్యర్థుల నామినేషన్లను అడ్డుకోవడం, వారి కుటుంబ సభ్యులను, చిన్నారులను వేధించడం నిత్యకృత్యమైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్ని ఇబ్బందులు పెడుతున్నప్పటికీ, దాడులకు తెగబడుతున్నప్పటికీ ఎక్కడా వెనక్కి తగ్గకుండా పార్టీ అధినేత వైయస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఉన్న అభిమానంతో బరిలోకి దిగుతున్న అభ్యర్థుల ధైర్యాన్ని ఎంత మెచ్చుకున్నా తక్కువేనని పేర్కొంటూ వారికి ప్రత్యేక కృతజ్ఞతలు, అభినందనలు తెలిపారు.

# 23 పురపాలకల్లోనూ ఎన్నికల నగారాకు సన్నాహాలు

**ఓటర్ల గుర్తింపునకు పురపాలక శాఖ ప్రత్యేక షెడ్యూల్ విడుదల!**



**అమరావతి, మహా:** ఆంధ్రప్రదేశ్‌లో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల సమరం తుది అంకానికి చేరుకుంటున్న వేళ రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. ప్రస్తుతం ఎన్నికల ప్రక్రియ కొనసాగుతున్న 100 పట్టణ స్థానిక సంస్థలతో పాటు, కోర్టు వివాదాల కారణంగా ఎన్నికలు నిలిచిపోయిన మిగిలిన 23 మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల్లోనూ ఎన్నికల నిర్వహణకు రంగం సిద్ధం చేస్తోంది. న్యాయస్థానాల్లో కేసులు పెండింగ్‌లో ఉన్నప్పటికీ, తీర్పు వెలువడిన వెంటనే ఎన్నికలు నిర్వహించేందుకు వీలుగా ముందస్తు కసరత్తును ప్రారంభించింది. ఇందులో భాగంగా ఆ 23 పట్టణ స్థానిక సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా రిజర్వేషన్లను ఖరారు చేసేందుకు అవసరమైన ఓటర్ల గుర్తింపు కోసం ఇంటింటి సర్వే నిర్వహించాలని నిర్ణయించింది. ఈ మేరకు శుక్రవారం నాడు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ఐదు రోజుల ప్రత్యేక షెడ్యూల్‌తో కూడిన ఉత్తర్వులను జారీ చేసింది.

**నవంబర్ 1న 100 స్థానాల్లో పోలింగ్.. 3న కౌంటింగ్.**

రాష్ట్రంలో తొలి విడతగా 13 నగరపాలక సంస్థలు, 87 పురపాలక సంఘాలు, నగర పంచాయతీలు కలిపి మొత్తం 100 పట్టణ స్థానిక సంస్థల్లో ఎన్నికల ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. అక్టోబర్ 16 నుంచి 18 వరకు నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, అక్టోబర్ 21న ఉపసంహరణ ప్రక్రియలు ఇప్పటికే పూర్తయ్యాయి. అయితే కొన్ని ప్రాంతాల్లో నామినేషన్ల దాఖలుపై తలెత్తిన వివాదాల నేపథ్యంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తాజా ఆదేశాల ప్రకారం రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) షెడ్యూల్‌ను సవరించింది. కడప కార్పొరేషన్‌లోని 11 డివిజన్లు, తిరుపతి కార్పొరేషన్‌లోని 18 డివిజన్లు, రాజంపేట మున్సిపాలిటీలోని 11 వార్డులు, మైదుకూరు మున్సిపాలిటీలోని 32 వార్డులు కలిపి మొత్తం 72 వార్డులు, డివిజన్లలో నామినేషన్లు వేయలేకపోయిన అభ్యర్థుల కోసం అక్టోబర్ 23, 24 తేదీల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కొత్తగా నామినేషన్లు స్వీకరిస్తున్నారు. అక్టోబర్ 25న నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ అనంతరం అభ్యర్థుల తుది జాబితాను ప్రచురిస్తారు. సిరిమాను ఉత్సవం కారణంగా గతంలో తేదీ మారిన విజయనగరం కార్పొరేషన్‌తో సహా మొత్తం 100 పట్టణ స్థానిక సంస్థల్లో నవంబర్ 1న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. అవసరమైన చోట నవంబర్ 2న రీపోలింగ్ జరిపి, నవంబర్ 3న ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను వెల్లడించేలా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా ఉత్తర్వులు జారీ చేశారు.

**కోర్టు కేసులున్న 23 పట్టణ స్థానిక సంస్థలపై ప్రభుత్వ ప్రత్యేక దృష్టి.**

ప్రస్తుతం ఎన్నికలు జరుగుతున్న 100 సంస్థలు కాకుండా రాష్ట్రంలోని మరో 23 పట్టణ స్థానిక సంస్థల్లో వివిధ న్యాయపరమైన చిక్కులు, కోర్టు కేసుల కారణంగా ఎన్నికలు నిర్వహించడం లేదు. ఈ జాబితాలో శ్రీకాకుళం, కాకినాడ, రాజమహేంద్రవరం, మంగళగిరితాడేపల్లి నగరపాలక సంస్థలతో పాటు ఆముదాలవలస, రాజాం, భీమవరం, తణుకు, పాలకొల్లు, తాడేపల్లిగూడెం, చింతలపూడి, తాడిగడప, గుడివాడ, పొన్నూరు, బాపట్ల, నరసరావుపేట, కందుకూరు, పొదిలి, అల్లూరు, నెల్లూరు జిల్లా గూడూరు, కావలి, శ్రీకాళహస్తి, బి.కొత్తకోట పురపాలక సంఘాలు, నగర పంచాయతీలు ఉన్నాయి. వీటిపై న్యాయస్థానాల్లో విచారణ కొనసాగుతున్నప్పటికీ, పరిపాలనాపరమైన ముందస్తు ప్రక్రియను పూర్తి చేసి సిద్ధంగా ఉంచాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగానే ఓటర్ల కుల గణన, వర్గాల వారీగా గుర్తింపు, రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియను తక్షణమే పూర్తి చేసేందుకు మున్సిపల్ శాఖ రంగంలోకి దిగింది.

**అక్టోబర్ 25 నుంచి 29 వరకు ఐదు రోజుల పాటు ఇంటింటి సర్వే.**

కోర్టు కేసుల్లో ఉన్న ఈ 23 పట్టణ స్థానిక సంస్థల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మహిళా రిజర్వేషన్లను శాస్త్రీయంగా ఖరారు చేసేందుకు ఐదు రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నారు. పురపాలక శాఖ విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 25, 26 తేదీల్లో ఆయా మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో వార్డుల వారీగా ప్రభుత్వ సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా ఓటర్లను ప్రత్యక్షంగా గుర్తిస్తారు. ఈ సర్వే ఆధారంగా అక్టోబర్ 27వ తేదీన గుర్తించిన ఓటర్ల వివరాలతో వార్డుల వారీగా ముసాయిదా (డ్రాఫ్ట్) ఓటర్ల జాబితాలను అధికారికంగా ప్రచురిస్తారు. అనంతరం అక్టోబర్ 28న ముసాయిదా జాబితాలపై ప్రజలు, రాజకీయ పక్షాల నుంచి క్లెయిమ్స్, అభ్యంతరాలను స్వీకరిస్తారు. అక్టోబర్ 29వ తేదీన ఆయా క్లెయిమ్స్, అభ్యంతరాలపై అధికారులు క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన జరిపి, తుది ఓటర్ల జాబితాలను ప్రచురిస్తారు.

**హైకోర్టు గ్రీన్ సిగ్నల్ రాగానే ఎన్నికల షెడ్యూల్:**

అక్టోబర్ 29 నాటికి తుది ఓటర్ల జాబితాలు సిద్ధం కానుండటంతో, ఆ వెంటనే ఆయా వార్డులు, డివిజన్లు, చైర్‌పర్సన్, మేయర్ స్థానాలకు రిజర్వేషన్లను ప్రభుత్వం ఖరారు చేయనుంది. అనంతరం పెండింగ్‌లో ఉన్న పిటిషన్లపై హైకోర్టు నుంచి గ్రీన్ సిగ్నల్ వెలువడగానే, రాష్ట్ర ఎన్నికల సంఘం ఈ 23 పట్టణ స్థానిక సంస్థల్లోనూ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసి పోలింగ్ నిర్వహించనుంది. మరోవైపు రాష్ట్రంలో నవంబర్ 3న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్, నవంబర్ 5న ఓట్ల లెక్కింపు జరగనుండగా, నవంబర్ 26 నుంచి మూడు విడతల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు ఎస్ఈసీ ఇప్పటికే షెడ్యూల్ ప్రకటించింది.



## వైద్య కళాశాలలో పారదర్శక
# నియామకాలు చేపట్టాలి

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**హాజీపూర్/మంచిర్యాల, మహా ప్రతినిధి :** ప్రభుత్వ వైద్య కళాశాలలో ఖాళీ పోస్టుల భర్తీని పూర్తి పారదర్శకంగా, మెరిట్ ప్రాతిపదికన నిర్వహించామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. శుక్రవారం హాజీపూర్ లోని ప్రభుత్వ వైద్య కళాశాలలో దంత వైద్య విభాగ అధ్యాపక పోస్టుల నియామక ప్రక్రియకు కళాశాల ప్రిన్సిపల్ దేవాజీ, మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ అశోక్ తో కలిసి కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎలాంటి అవకతవకలకు తావులేకుండా నిబంధనల ప్రకారం నియామకాలు చేపట్టామన్నారు. రాత పరీక్ష, పీజీ మార్కులు, ఇంటర్వ్యూ మార్కులకు వెయిటేజీ ఇచ్చి, అభ్యర్థుల విద్యార్హత, ప్రతిభ, అనుభవాన్ని పరిశీలించి తుది మెరిట్ నిర్ణయించామని తెలిపారు. ఈ ప్రక్రియలో అభిషేక్ అనే అభ్యర్థి అత్యుత్తమ ప్రతిభ కనబరచడంతో ఎంపిక చేసినట్లు వెల్లడించారు. త్వరలో నియామక ఉత్తర్వులు జారీ చేస్తామన్నారు. అనంతరం కళాశాలలో విద్యార్థులకు మెరుగైన వాతావరణం, మైదాన అభివృద్ధి, క్రీడా వసతులు, తాగునీరు, ఇంటర్నెట్ సౌకర్యాల మెరుగుదలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు ఉన్నారు.



# ఎస్ఐఆర్ ప్రక్రియను బేషరతుగా రద్దు చేయాలి

- **మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్యకు వినతి**

**మంచిర్యాల, మహా ప్రతినిధి** : కేంద్రం చేపడుతున్న ప్రజా వ్యతిరేక (ఎస్ఐఆర్) ప్రక్రియను బేషరతుగా రద్దు చేయాలని కోరుతూ సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐకేఎస్ జిల్లా కార్యదర్శి కొండు బానేష్, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు లాల్ కుమార్ లు మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణ పేరుతో అర్హులైన ఓటర్ల ఓట్లను తొలగిస్తున్నారని ఆరోపించారు.రాజ్యాంగబద్ధంగా స్వతంత్రంగా వ్యవహరించాల్సిన ఎన్నికల కమిషన్ కేంద్ర ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. ఇప్పటికే కోట్లాది మంది అర్హుల ఓట్లను తొలగించారని ఆందోళన వ్యక్తం చేశారు. తొలగించిన ఓట్లను ఎలాంటి షరతులు లేకుండా తిరిగి ఓటరు జాబితాలో చేర్చాలని, కేంద్ర ఎన్నికల కమిషనర్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎస్ జిల్లా కార్యదర్శి బోడెంకి చందు, ఏఐకేకేఎస్ జిల్లా కార్యదర్శి గోగర్ల శంకర్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ప్రకాష్, ఏఐకేఎస్ సహాయ కార్యదర్శి ఇందారపు రాజేష్, ఏఐకేఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షులు దొండ ప్రభాకర్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మహేష్, రాములు (రజక్), ప్రేమ్ కుమార్, వేల్పుల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# దేశ రాజకీయాల్లో కేసీఆర్ చక్రం తిప్పే రోజులు వస్తున్నాయి

- **బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**
- **కాంగ్రెస్, బీజేపీయేతర కూటమి దేశంలో కీలకపాత్ర పోషించడం ఖాయం**

**హైదరాబాద్, మహా** : దేశ రాజకీయాల్లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కీలక పాత్ర పోషించే రోజులు దగ్గరలోనే ఉన్నాయని, ఆయన జాతీయ స్థాయిలో చక్రం తిప్పే సమయం ఆసన్నమైందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వ హడావిడి కొద్దిరోజులు మాత్రమేనని, ఆ తర్వాత మళ్లీ కేసీఆరే ముఖ్యమంత్రి అవుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన అంబర్‌పేట నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య నేతల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని కేటీఆర్ ఆరోపించారు. తీవ్రమైన విద్యుత్ కోతల వల్ల రైతులు అల్లాడుతున్నారని, వారి కష్టాలను పట్టించుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. ఎల్‌నినో ప్రభావంపై నిపుణులు పది నెలల ముందే హెచ్చరించినప్పటికీ, ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టడంలో విఫలమైందని మండిపడ్డారు. కాంగ్రెస్ హామీలను నమ్మి మోసపోయిన అన్ని వర్గాల ప్రజలు ఇప్పుడు మళ్లీ బీఆర్ఎస్ వైపే చూస్తున్నారని అన్నారు. రేవంత్ రెడ్డి హడావిడి మరికొద్దిరోజులు మాత్రమే ఉంటుందని కేటీఆర్ పేర్కొన్నారు. జాతీయ రాజకీయాల గురించి ప్రస్తావిస్తూ, భవిష్యత్తులో కాంగ్రెస్, బీజేపీయేతర పార్టీలే దేశంలో నిర్ణయాత్మక పాత్ర పోషిస్తాయని కేటీఆర్ జోస్యం చెప్పారు. రాహుల్ గాంధీ ఎన్ని ప్రయత్నాలు చేసినా ఆశించిన ఫలితం ఉండదని, అటు ప్రధాని మోదీ పాలనలోనూ దేశానికి చేకూరిన ప్రయోజనం ఏమీ లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం తెలంగాణ నుంచి గెలిచిన ఎంపీలెవరూ పార్లమెంటులో గళం విప్పడం లేదని ఆయన దుయ్యబట్టారు. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు యువత తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉందని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రభుత్వ వైఫల్యాల వల్లే నేడు యువత రోడ్లపైకి వచ్చి పోరాటాలు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నేతలు రాష్ట్ర అభివృద్ధిని విస్మరించి, కేవలం ప్రతిపక్షాలను విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని ఆయన ఆరోపించారు.

# త్వరలో ఆమరణ దీక్ష!

**డంపింగ్ యార్డు దుస్థితిపై భావోద్వేగానికి గురైన ఎమ్మెల్యే మల్లారెడ్డి..**



**హైదరాబాద్, మహా :** మేడ్చల్ మల్కాజ్‌గిరి నియోజకవర్గంలోని జవహర్‌నగర్ డంపింగ్ యార్డు కారణంగా స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న నరకయాతనపై ఎమ్మెల్యే, మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఆ ప్రాంత ప్రజల దుస్థితిని చూసి చలించిపోయిన ఆయన భావోద్వేగానికి గురయ్యారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న డంపింగ్ యార్డును వెంటనే తరలించాలని డిమాండ్ చేస్తూ, త్వరలోనే తాను ఆమరణ నిరాహార దీక్షకు దిగుతానని ఆయన సంచలన ప్రకటన చేశారు.జవహర్‌నగర్ తన నియోజకవర్గంలో ఉందని, అది తన గుండెకాయ వంటిదని మల్లారెడ్డి పేర్కొన్నారు. తాజాగా జవహర్‌నగర్ పరిస్థితులపై ఒక అమెరికన్ యూనివర్సిటీ విడుదల చేసిన సర్వే నివేదిక అత్యంత ఆందోళన కలిగిస్తోందని ఆయన తెలిపారు. ప్రపంచంలోనే అత్యధికంగా మీథేన్ విషవాయువులు ఉద్గారమవుతున్న ప్రాంతాల జాబితాలో జవహర్‌నగర్ ఏకంగా నాలుగో స్థానంలో నిలిచిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రాణాంతక వాతావరణం కారణంగా ఆ ప్రాంతంలో రోజుకు ఇద్దరు చొప్పున వ్యక్తులు అనుమానాస్పద స్థితిలో మరణిస్తున్నారని, వారి అకస్మిక మృతికి అసలు కారణాలు ఏమిటో కూడా అంతుచిక్కడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా డంపింగ్ యార్డ్ నిర్వహణ బాధ్యతలు చూస్తున్న రాంకీ సంస్థ తీరుపై మల్లారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డ్ నిర్వహణ కోసం 2006లో రాంకీ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంటే, ఆ సంస్థ నిబంధనలను గాలికి వదిలేసిందని మండిపడ్డారు. బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన సదరు సంస్థ, జవహర్‌నగర్ ప్రాంతాన్ని నివాసయోగ్యం కాకుండా ఒక విషవలయంగా మార్చిందని ధ్వజమెత్తారు.ఈ తీవ్ర సమస్యపై మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ వెంటనే జోక్యం చేసుకోవాలని మల్లారెడ్డి కోరారు. కేంద్ర ప్రభుత్వంపై తగిన ఒత్తిడి తీసుకువచ్చి జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్‌ను తక్షణమే వేరే ప్రాంతానికి తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. స్థానిక ప్రజల ప్రాణాలను కాపాడేందుకు, వారి దీర్ఘకాలిక సమస్యకు శాశ్వత పరిష్కారం లభించే వరకు తాను విశ్రమించనని, అవసరమైతే ఆమరణ నిరాహార దీక్షకైనా వెనుకాడబోనని మల్లారెడ్డి స్పష్టం చేశారు.

# వ్యవసాయంపై సంక్షోభ మేఘాలు!



భారత వ్యవసాయ రంగం కీలకమైన మలుపు వద్ద నిలిచింది. ఒకవైపు అంతర్జాతీయ యుద్ధాలు, మరోవైపు చమురు ధరల్లో హెచ్చుతగ్గులు, ఇంకోవైపు వాతావరణ మార్పులు.. వెరసి సాగు రంగాన్ని అనిశ్చితి చుట్టుముడుతోంది. ఎరువుల తయారీకి అవసరమైన ముడిసరుకుల సరఫరా నుంచి పంటల దిగుబడుల వరకు అనేక అంశాలపై ఈ పరిణామాలు ప్రభావం చూపుతున్నాయి. వీటిని విడివిడిగా చూసి పరిష్కారాలు వెతకడం కంటే, పరస్పరం ముడిపడిన సంక్షోభాలుగా గుర్తించి సమగ్ర కార్యాచరణ రూపొందించాల్సిన అవసరం ఉంది. ఆహార భద్రతకు వెన్నెముకగా నిలిచే వ్యవసాయాన్ని అంతర్జాతీయ పరిణామాల ఒడిదొడుకుల నుంచి కాపాడటం ఇప్పుడు విధాన నిర్ణేతల ముందున్న ప్రధాన కర్తవ్యం.

స్వాతంత్ర్యం వచ్చిన తొలి దశల్లో భారత వ్యవసాయం ప్రధానంగా పశువుల శక్తి, సహజ ఎరువులు, సంప్రదాయ సాగు పద్ధతులపై ఆధారపడేది. హరిత విప్లవం తర్వాత అధిక దిగుబడినిచ్చే వంగడాలు, రసాయన ఎరువులు, పురుగుమందులు, యంత్రాల వినియోగం పెరిగాయి. ఆహార ధాన్యాల ఉత్పత్తి గణనీయంగా పెరిగి దేశం ఆహార స్వావలంబన దిశగా అడుగులు వేసింది. అయితే ఈ పురోగతితోపాటు ఇంధనంపై ఆధారపడటమూ అధికమైంది.

ట్రాక్టర్లకు డీజిల్, బోర్లకు విద్యుత్తు, ఎరువుల తయారీకి సహజ వాయువు, వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు చమురు.. ఇలా సాగులోని ప్రతి దశ ఏదో ఒక రూపంలో ఇంధనంతో ముడిపడింది. అంతర్జాతీయ మార్కెట్లలో చమురు ధరలు పెరిగినా, సరఫరాకు ఆటంకాలు ఏర్పడినా ఆ ప్రభావం వ్యవసాయంపై పడుతోంది. ఉత్పత్తి వ్యయం పెరిగినా పంటకు తగిన ధర లభించకపోతే రైతు ఆదాయం క్షీణిస్తుంది. ఈ పరిస్థితి సాగును ఆర్థికంగా మరింత ప్రమాదకరంగా మారుస్తుంది.

యుద్ధాల ప్రభావం ఎరువులపైనా

రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు అంతర్జాతీయ ఇంధన, సరఫరా వ్యవస్థలకు సవాళ్లు విసురుతున్నాయి. చమురు, సహజ వాయువు ధరల్లో పెరుగుదల ఎరువుల తయారీ వ్యయాన్ని పెంచే ప్రమాదం ఉంది. ముఖ్యంగా యూరియా ఉత్పత్తిలో సహజ వాయువు కీలక ముడిసరుకు. భాస్వరం ఆధారిత ఎరువుల తయారీలోనూ సల్ఫర్ వంటి పదార్థాలకు ప్రాధాన్యం ఉంది. వీటి లభ్యత తగ్గినా, దిగుమతులు ఖరీదైనప్పటికీ దేశీయ సరఫరాపై ఒత్తిడి పెరుగుతుంది.

భారత్ ఎరువుల రంగంలో కొన్ని కీలక ముడిసరుకులు, ఉత్పత్తుల కోసం విదేశాలపై ఆధారపడుతోంది. అంతర్జాతీయ ధరల పెరుగుదల ప్రభుత్వ సబ్సిడీ వ్యయాన్ని పెంచడంతోపాటు వ్యవసాయ ఉత్పత్తి వ్యయంపైనా ప్రభావం చూపుతుంది. ఎరువుల ధరలను రైతులకు అందుబాటులో ఉంచడం ఎంత ముఖ్యమో, వాటి సరఫరాలో నిరంతరతను కాపాడటం కూడా అంతే ముఖ్యం. దేశీయ ఉత్పత్తిని బలోపేతం చేయడం, ప్రత్యామ్నాయ పోషక వనరులను అభివృద్ధి చేయడం, వ్యూహాత్మక నిల్వలపై దృష్టి సారించడం అవసరం.

ఆహారమా? ఇంధనమా?

చమురుపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు జీవ ఇంధనాల వినియోగాన్ని పెంచడం ప్రపంచవ్యాప్తంగా ప్రాధాన్యం సంతరించుకుంది. పెట్రోల్‌లో ఇథనాల్ కలపడం, వంటనూనెల నుంచి బయోడీజిల్ తయారు చేయడం ఇందుకు ఉదాహరణలు. భారత్‌లోనూ చెరకు, మొక్కజొన్న, బియ్యం వంటి ముడిసరుకుల నుంచి ఇథనాల్ ఉత్పత్తి చేస్తున్నారు. ఈ విధానం ఇంధన దిగుమతులను తగ్గించడంలో తోడ్పడగలదు. కానీ ఆహార పంటలను ఇంధన తయారీకి మళ్లించేటప్పుడు జాగ్రత్త అవసరం.

ఆహార అవసరాలు, పశుగ్రాసం, పారిశ్రామిక వినియోగం, ఇంధన తయారీ.. వీటి మధ్య సమతుల్యత దెబ్బతింటే మార్కెట్లపై ఒత్తిడి పెరగవచ్చు. ముఖ్యంగా పంటల దిగుబడులు తగ్గిన సంవత్సరాల్లో ఈ పోటీ మరింత సమస్యాత్మకంగా మారుతుంది. అందుకే ఆహార భద్రతకు విఘాతం కలగకుండా వ్యవసాయ వ్యర్థాలు, ఇతర ప్రత్యామ్నాయ ముడిసరుకుల నుంచి జీవ ఇంధనాలను ఉత్పత్తి చేసే సాంకేతికతలకు ప్రోత్సాహం ఇవ్వాలి. ఇంధన స్వావలంబన సాధించే క్రమంలో ఆహార భద్రతను విస్మరించరాదు.

అంతర్జాతీయ పరిణామాలకు తోడు వాతావరణ మార్పులు వ్యవసాయాన్ని అనిశ్చితిలోకి నెడుతున్నాయి. వర్షపాతంలో అసమానతలు, అధిక ఉష్ణోగ్రతలు, కరవు, వరదలు పంటల దిగుబడులను ప్రభావితం చేస్తున్నాయి. ఎల్‌నినో వంటి వాతావరణ దృగ్విషయాలు కొన్ని పరిస్థితుల్లో రుతుపవనాలపై ప్రభావం చూపవచ్చు. అయితే వాటి ప్రభావం ప్రతి ఏడాది, ప్రతి ప్రాంతంలో ఒకేలా ఉండదు. అందువల్ల శాస్త్రీయ అంచనాల ఆధారంగా ముందస్తు ప్రణాళికలు రూపొందించాలి.

197980లో భారత వ్యవసాయ రంగం తీవ్ర ప్రతికూలతలను ఎదుర్కొందని వ్యవసాయ విశ్లేషకుడు హరీశ్ దామోదరన్ తన వ్యాసంలో ప్రస్తావించారు. గత అనుభవాలు ఒక విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. ప్రకృతి వైపరీత్యాలు, ఇంధన సంక్షోభాలు ఏకకాలంలో ఎదురైనప్పుడు వాటి ప్రభావం సాధారణ పరిస్థితుల కంటే తీవ్రంగా ఉండవచ్చు. ప్రస్తుత వ్యవసాయ వ్యవస్థ గతంతో పోలిస్తే విస్తరించినప్పటికీ, కొత్త రకాల ప్రమాదాలను ఎదుర్కొనేందుకు మరింత సంసిద్ధత అవసరం.

సంస్కరణలే శాశ్వత పరిష్కారం

ఎరువులను అవసరానికి మించి వినియోగించడం, నీటి వనరులను విచక్షణారహితంగా వాడటం, ఒకే రకమైన పంటలపై అధికంగా ఆధారపడటం వంటి సమస్యలను సరిదిద్దాలి. నేల పరీక్షల ఆధారంగా సమతుల్య ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించాలి. సమగ్ర సస్యరక్షణ పద్ధతులు, పంటల వైవిధ్యం, నేల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యమివ్వాలి. సౌరశక్తితో నడిచే పంపులు, బిందు సేద్యం, నీటి పొదుపు పద్ధతులను విస్తరించాలి.

వాతావరణ మార్పులను తట్టుకునే పంట రకాలు, నాణ్యమైన విత్తనాలు, ఆధునిక వ్యవసాయ పరిశోధనలకు ప్రాధాన్యమివ్వాలి. రైతులకు సకాలంలో వాతావరణ సమాచారం అందించడంతోపాటు పంటల బీమా, గిట్టుబాటు ధరలు, శాస్త్రీయ నిల్వ సదుపాయాలు, మార్కెట్ అనుసంధానాన్ని బలోపేతం చేయాలి. అంతర్జాతీయ సంక్షోభాలను నివారించడం మన చేతుల్లో లేకపోయినా.. వాటి ప్రభావాన్ని తగ్గించుకునే ముందస్తు వ్యూహాలను రూపొందించుకోవడం మన చేతుల్లోనే ఉంది.

వ్యవసాయం కేవలం పంటల దిగుబడులకు సంబంధించిన అంశం కాదు.. కోట్లాది కుటుంబాల జీవనాధారం, దేశ ఆహార భద్రతకు పునాది. రైతు సంక్షేమం, ప్రకృతి వనరుల పరిరక్షణ, ఇంధన భద్రత పరస్పరం ముడిపడిన అంశాలని గుర్తించి విధానాలను రూపొందించాలి. సంక్షోభం తలెత్తినప్పుడు తాత్కాలిక ఉపశమన చర్యలు చేపట్టడం కంటే, భవిష్యత్తు సవాళ్లను ముందుగానే అంచనా వేసి ఎదుర్కొనేలా వ్యవసాయ రంగాన్ని తీర్చిదిద్దడం ముఖ్యం. రైతుకు భరోసా.. వ్యవసాయానికి స్థిరత్వం.. దేశానికి ఆహార భద్రత లక్ష్యాలుగా సమగ్ర కార్యాచరణ సాగినప్పుడే భారత వ్యవసాయం అంతర్జాతీయ అనిశ్చితులను తట్టుకొని నిలబడగలదు. అదే సుస్థిర వ్యవసాయానికి, నిజమైన స్వావలంబనకు బాట వేస్తుంది.



**అమరవాజీ నాగరాజు**
**టీపీసీసీ ప్రెసిడెంట్ పీఆర్ఓ**

# నిరసన కారులు బహు పరాక్

ఇటీవల కాలంలో నిరసన కారులు పెట్రేగి పోతున్నారు.అయిన దానికి కాని దానికి ప్రతి చిన్న విషయానికి ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేస్తున్నారు. భారత్ లాంటి పెద్ద ప్రజాస్వామ్యం గల దేశంలో ఎక్కడో ఒక చోట విధ్వం సృష్టిస్తున్నారు. నిరసన కారులకు ప్రధానంగా దొరికేవి బస్సు లే. వాటికి గాలి తీయడం, అద్దాలు పగల కొట్టడం, ప్రయాణికుల సీట్స్ లను కోయడం, వాటిని పాడు చేయడం చేస్తున్నారు. ఇంకా కొందరు ప్రభుత్వ కార్యాలయం లలో ఫైల్స్ కు నిప్పు పెట్టడం, ఫర్నిచర్ ను పాడు చేయడం చూస్తున్నదే. ఇది ఒక్క భారత దేశంలో నే అనుకుంటే పొరపాటే విదేశాలలో సైతం చూస్తున్నదే. మైనర్లు అయినా మేజర్లు అయినా ప్రభుత్వ ఆస్తులు ఎట్టి పరిస్థితి లోను నష్టం కలిగించకూడదు. అందుకేనేమో ఇటలీ లో ఒక కొత్త చట్టం చేశారు. ఇటలీలో ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగిస్తే 'మెలోని ' ప్రభుత్వం చాలా కట్టుదిట్ట మైన చర్యలు చేపట్టింది. అది ఏమిటంటే మైనర్లు అక్కడ ఎక్కువగా ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగిస్తున్నారు. అందుకే మెలోని ప్రభుత్వం కొత్త చట్టం తెచ్చింది. కొత్త చట్టం ప్రకారం నిరసనకారులు ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగిస్తే వారి తల్లితండ్రులను బాధ్యులుగా చేసి వారి తోనే నష్ట పరిహారం వసూలు చేసేలా ఒక సరి కొత్త చట్టం తీసుకు వచ్చింది. దీని ప్రకారం ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేస్తే క్రిమినల్ నేరంగా పరిగణిస్తారు. అందుకు ఐదు సంవత్సరాల వరకు జైలు శిక్ష విధిస్తారు. అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే వారి పై మరింత నిఘా పెడతారు. ఇది చాలా వరకు ఆస్తులు ధ్వంసం కాకుండా చూస్తుంది అని రాజకీయ మేధావుల అభిప్రాయం గా ఉంది. ఒక్క మైనర్లే కాకుండా మేజర్ల కు కూడా ఈ శిక్ష ఉండాలి.. కొన్ని దేశాలలో మేజర్లే ఎక్కువగా ప్రభుత్వ ఆస్తులకు తీవ్ర నష్టం కలిగిస్తున్నారు. వారికి కూడా ఇది వర్తింప చేయాలి. భారత్ లో అయితే మరీ తీవ్ర నష్టం ఉంది. ఇది ఎన్నికలలో ఎక్కువగా ఉంటోంది. సిసి కెమెరాలలో నష్ట పరిచే వారు చాలా స్పష్టంగా ఆగుపడతారు. అటువంటి వారిని అరెస్ట్ చేసి, కేసు నమోదు చేసి, నష్ట పరిహారం వారు తోనే కట్టింప చేయాలి. దీనికి కాలయాపన చేయరాదు. నిర్ధారించుకుంటున్న తరువాత, ఆ వీడియో ను వారికి చూపించి నష్ట పరిహారం వసూలు చేయాలి. అప్పుడు కాని ప్రజా ఆస్తులు ధ్వంసం కావు. ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేసినట్లు తమ, తమ సొంత గృహాల లో టీవీలు కాని, కుర్చీలు కాని, సోఫాలు కాని నష్టం చేసుకోరు. తేరగా వచ్చిందని ప్రతి వారు కోపం వస్తే ఆస్తుల విధ్వంసా నికే పాల్పడుతున్నారు. ఇటలీ లో తెచ్చిన చట్టం సహేతుకమే. అక్కడి ప్రభుత్వం నిరసనకారులపై ఉక్కు పాదం మోపింది. కాకపోతే ఇది మేజర్లకు కూడా వర్తించాలి. భారత్ లో ఇటువంటి చట్టాలు సహేతుకంగా, పారదర్శకంగా చేస్తే ఆశించిన ఫలితం ఉంటుంది. చట్టాలు చూసయినా నిరసనకారులు వెనక్కి తగ్గ వచ్చు. ఏదైనా స్వేచ్ఛగా, శాంతి యుతంగా జరగాలని కోరుకుందాం.

**కనుమ ఎల్లారెడ్డి,**
**9391523027.**



# శరీరానికి ఎంత ప్రోటీన్ అవసరం?

**కండరాల బలానికి సమతుల ఆహారమే కీలకం.. అతిగా తీసుకుంటే అనవసర సమస్యలు!**



శరీరం ఆరోగ్యంగా ఉండాలంటే పోషకాహారం ఎంతో ముఖ్యం. ఇందులో ప్రోటీన్ కీలక పాత్ర పోషిస్తుంది. కండరాల నిర్మాణం, కణజాలాల మరమ్మతు, శరీర విధుల నిర్వహణకు ఇది అవసరం. అయితే ప్రోటీన్ ఎక్కువగా తీసుకుంటేనే ఆరోగ్యం మెరుగుపడుతుందనుకోవడం పొరపాటు. వయసు, శరీర బరువు, శారీరక శ్రమ, ఆరోగ్య పరిస్థితులను బట్టి రోజువారీ అవసరాలు మారుతుంటాయి. అందువల్ల సరైన మోతాదులో, సమతుల ఆహారంలో భాగంగా ప్రోటీన్ తీసుకోవడం ముఖ్యం.

**బరువును బట్టి అవసరం**

భారతీయ వైద్య పరిశోధనా మండలి (ICMR), జాతీయ పోషకాహార సంస్థ (NIN) మార్గదర్శకాల ప్రకారం ఆరోగ్యవంతులైన పెద్దలకు రోజుకు ప్రతి కిలో శరీర బరువుకు సుమారు 0.83 గ్రాముల ప్రోటీన్ అవసరం. ఉదాహరణకు 65 కిలోల బరువున్న వ్యక్తికి రోజుకు సుమారు 54 గ్రాములు అవసరమవుతాయి. ఇది సాధారణ మార్గదర్శకం మాత్రమే. వ్యాయామం చేసే వారు, వృద్ధులు, గర్భిణులు, పాలిచ్చే తల్లులకు అవసరాలు భిన్నంగా ఉండవచ్చు. <

**ఆహారంలోనే సమృద్ధిగా..**

ప్రోటీన్ కోసం ఖరీదైన సప్లిమెంట్లపైనే ఆధారపడాల్సిన అవసరం లేదు. మన రోజువారీ ఆహారంలోనే అనేక మంచి వనరులు ఉన్నాయి. పప్పులు, శనగలు, పెసలు, సోయా, పాలు, పెరుగు, పనీర్, గుడ్లు, చేపలు, చికెన్ వంటి పదార్థాల ద్వారా ప్రోటీన్ పొందవచ్చు. అన్నం, ఇతర ధాన్యాలతో పాటు పప్పులు తీసుకోవడం ద్వారా అవసరమైన అమైనో ఆమ్లాలను అందించుకోవచ్చు. ప్రతి భోజనంలో తగిన ప్రోటీన్ వనరును చేర్చుకోవడం మంచి అలవాటు. అలాగే పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు కూడా ఆహారంలో ఉండేలా చూసుకోవాలి.

**వ్యాయామంతోనే మెరుగైన ఫలితాలు**

కండరాలను పెంచుకోవాలనుకునేవారు ప్రోటీన్ తీసుకోవడంతోపాటు క్రమం తప్పకుండా శక్తి పెంచే వ్యాయామాలు చేయాలి. తగిన నిద్ర, విశ్రాంతి, సమతుల ఆహారం కూడా అవసరం. ప్రోటీన్ అధికంగా తీసుకున్నంత మాత్రాన కండరాలు పెరగవు. ఆహార నాణ్యత, వ్యాయామ పద్ధతి, శరీరానికి అందే మొత్తం శక్తి కూడా ఫలితాలను ప్రభావితం చేస్తాయి. వైద్య నిపుణుల సూచన లేకుండా అధిక మోతాదులో ప్రోటీన్ పౌడర్లు తీసుకోవడం మంచిది కాదు.

ఎవరు జాగ్రత్త పడాలి?

కిడ్నీ లేదా కాలేయ సంబంధిత సమస్యలు ఉన్నవారు ప్రోటీన్ పరిమాణాన్ని సొంతంగా పెంచుకోకూడదు. వైద్యులు లేదా డైటీషియన్ల సలహాతో తమకు తగిన మోతాదును నిర్ణయించుకోవాలి. మొత్తంగా, ఆరోగ్యానికి ప్రోటీన్ అవసరమే అయినా.. సరైన పరిమాణంలో, వివిధ ఆహార పదార్థాల ద్వారా తీసుకోవడమే ఉత్తమ మార్గం. సమతుల ఆహారం, క్రమబద్ధమైన వ్యాయామం కలిపి పాటిస్తే ఆరోగ్యాన్ని మెరుగ్గా కాపాడుకోవచ్చు.



## నీటి వృధాను అరికట్టాలి

**ఎంపీడీవో జలంధర్ రెడ్డి**

**వలిగొండ అక్టోబర్ 23 మహా న్యూస్** : ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో భవిష్యత్తులో నీటి కొరత తలెత్తకుండా ప్రతి ఒక్కరు నీటి వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని వలిగొండ ఎంపీడీవో జలంధర్ రెడ్డి వ్యవసాయ శాఖ అధికారి అంజనీదేవి అన్నారు శుక్రవారం మండలంలోని ఏదుళ్ళగూడెం దాసిరెడ్డిగూడెం గ్రామాలలో సదస్సులు నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నీటిని పొదుపుగా వినియోగించాలన్నారు తెలంగాణ భూగర్భ జల శాఖ తాజా నివేదికల ప్రకారం భూగర్భ జలాల పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని ప్రతి చుక్కనీటినీ సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు భవిష్యత్ తరాలకు నీటి వనరులను అందించేలా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు నీటి పొదుపు చేయండి భవిష్యత్ తరాలకు అందించండి అని వారు ప్రజలకు రైతులకు విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో సర్పంచులు రైతులు అధికారులు తదితరులు పాల్గొన్నారు




## గ్రామకంఠం భూమిపై వెంటనే సర్వే చేపట్టాలి

**మాయమైన భూమిని గుర్తించి గ్రామపంచాయతీకి అప్పగించాలి**

**వలిగొండ, మహా న్యూస్:** మండలంలోని గోపరాజుపల్లి గ్రామంలో గ్రామకంఠం భూమిపై వెంటనే సమగ్ర సర్వే చేపట్టి, ఆక్రమణలకు గురైన భూమిని గుర్తించి గ్రామపంచాయతీకి అప్పగించాలని గ్రామస్థులు కోరుతున్నారు. గ్రామంలోని సర్వే నంబర్ 4లో మొత్తం ఎకరం 19 గుంటల గ్రామకంఠం భూమి ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం 30 గుంటల భూమి కూడా లేకుండా పోయిందని గ్రామస్థులు పేర్కొంటున్నారు. అసలు మిగిలిన భూమి ఎక్కడికి వెళ్లిందనే విషయంపై సమగ్రంగా విచారణ జరిపి, భూమి వివరాలను అధికారులు తేల్చాలని వారు కోరుతున్నారు. ఈ మేరకు మండల తహశీల్దార్ దశరథను కలిసి సమస్యను వివరించి, వెంటనే సర్వేయర్‌ను పంపించి భూమిని సర్వే చేయించాలని విజ్ఞప్తి చేశారు. సర్వే నిర్వహించి గ్రామకంఠం భూమిలో కబ్జాలు ఉన్నట్లు తేలితే, వాటిని గుర్తించి నిబంధనల ప్రకారం స్వాధీనం చేసుకుని గ్రామపంచాయతీకి అప్పగించాలని గ్రామస్థులు తహశీల్దార్‌ను కోరారు.

## అద్దె వాహన డ్రైవర్లకు రూ.5,500 వెంటనే చెల్లించాలి

**ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్.మధుసూదన్‌రెడ్డి డిమాండ్**

**మణుగూరు, మహా :** సింగరేణి అద్దె వాహన డ్రైవర్లతో పాటు ఇప్పటివరకు లాభాల వాటా అందని కాంట్రాక్టు కార్మికులందరికీ ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం ప్రకటించిన రూ.5,500 వెంటనే చెల్లించాలని ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (టీయూసీఐ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్. మధుసూదన్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం మణుగూరు ఏరియాలోని ఓసీ2లో నిర్వహించిన సింగరేణి అద్దె వాహన డ్రైవర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణిలోని వివిధ విభాగాల కాంట్రాక్టు కార్మికులకు ప్రకటించిన లాభాల వాటా మణుగూరు ఏరియాలోని అద్దె వాహన డ్రైవర్లతో పాటు పలు విభాగాల కార్మికులకు నేటికీ అందలేదని పేర్కొన్నారు. ఈ విషయాన్ని సంబంధిత వాహనాల ఇన్‌చార్జి దృష్టికి తీసుకెళ్లగా చెల్లింపుల ప్రక్రియ ప్రారంభించామని, రెండు రోజుల్లో అందరికీ అందేలా చూస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. యాజమాన్యం ఇచ్చిన హామీ మేరకు రెండు రోజుల్లో పెండింగ్‌లో ఉన్న కార్మికులందరికీ రూ.5,500 చొప్పున చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో సింగరేణి అద్దె వాహన డ్రైవర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎయిర్‌పోర్ట్ భూసేకరణ మరింత వేగవంతం

- **నిర్వాసితులకు సత్వరమే పరిహారం**
- **సంబంధిత అధికారులు,ఐఏఎఫ్ బృందం తో కలెక్టర్ సమీక్ష**
- **అధికారులకు పలు ఆదేశాలు**



**ఆదిలాబాద్ మహా:** జిల్లాలో ప్రతిపాదిత విమానాశ్రయ విస్తరణకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను ఎలాంటి జాప్యానికి తావులేకుండా పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. భూసేకరణకు సంబంధించిన పెండింగ్ అంశాలను త్వరితగతిన పరిష్కరించి, క్షేత్రస్థాయిలో పనులు నిర్దేశిత ప్రణాళిక ప్రకారం ముందుకు సాగేలా చర్యలు చేపట్టాలని సూచించారు.శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ (ఐ ఎ ఎఫ్) పర్యవేక్షక బృందంతో కలిసి ఎయిర్‌పోర్ట్ భూసేకరణ పనుల పురోగతిపై కలెక్టర్ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. విమానాశ్రయ విస్తరణకు అవసరమైన భూమి వివరాలు, ఇప్పటివరకు చేపట్టిన సర్వే, భూసేకరణ పురోగతి, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలు తదితర అంశాలపై అధికారులతో చర్చించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విమానాశ్రయ అభివృద్ధిలో భూసేకరణ ప్రక్రియ అత్యంత కీలకమైనదని పేర్కొన్నారు. సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ భూసేకరణకు సంబంధించిన అన్ని అంశాలను నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో నిర్వహిస్తున్న భూ సర్వే పనులను పకడ్బందీగా చేపట్టాలని, సర్వే సమయంలో ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైన వివరాలను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో సేకరించి, ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. విమానాశ్రయ విస్తరణ కోసం భూములు కోల్పోతున్న నిర్వాసితుల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని కలెక్టర్ తెలిపారు. నిబంధనల ప్రకారం అర్హత కలిగిన ప్రతి భూ నిర్వాసితుడికి అందాల్సిన పరిహారం, పునరావాస ప్రయోజనాలు సత్వరమే అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూసేకరణ ప్రక్రియలో పారదర్శకత పాటించాలని, భూములకు సంబంధించిన రికార్డులు, హక్కులు, ఇతర వివరాలను నిశితంగా పరిశీలించి అర్హులైన వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.భూసేకరణకు సంబంధించి ఇప్పటివరకు చేపట్టిన సర్వే, భూముల వివరాల సేకరణ, క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులు, పరిష్కరించాల్సిన అంశాలపై జిల్లా స్థాయి అధికారులు, రెవెన్యూ సిబ్బంది కలెక్టర్‌కు వివరించారు. భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసేందుకు చేపడుతున్న చర్యలను తెలియజేశారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఎయిర్‌ఫోర్స్ పర్యవేక్షక బృందం సభ్యులు కెప్టెన్ రాకేష్, ఎస్.ఆర్. సింగ్, ఆర్డీవో జగదీశ్వర్‌రావు, ల్యాండ్ సర్వే ఆర్ఏడీ ప్రభాకర్, మున్సిపల్ కమిషనర్ జగదీష్ గౌడ్, సంబంధిత శాఖల అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



# బతుకమ్మ వేడుకలలో పాల్గొన్న కంది శ్రీనివాస రెడ్డి దంపతులు

**ఆదిలాబాద్ మహా :** తెలంగాణ సంస్కృతీ సాంప్రదాయాలకు బతుకమ్మ వేడుకలు అద్దం పడతాయని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి ఆయన సతీమణి కంది మౌన శ్రీనివాస రెడ్డి అన్నారు. జిల్లాలో బతుకమ్మ సంబరాలను పురస్కరించుకొని జైనథ్ మండల కేంద్రంలో పలు చోట్ల నిర్వహించిన బతుకమ్మ వేడుకలకు హాజరయ్యారు. స్థానికులు పార్టీ శ్రేణులు వారికి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం స్థానిక మహిళలు యువతులు పిల్లలతో కలిసి బతుకమ్మల చుట్టూ ఉత్సాహంగా నృత్యాలు చేసారు.పూలను ప్రకృతిని ఆరాధించడం తెలంగాణ గొప్ప సాంప్రదాయమని అన్నారు. ప్రతీ సంవత్సరం ఇలాగే సంబరాలను వైభవంగా నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో నాయకులు రంగినేని శాంతన్ రావు,కొండ గంగాధర్ , దర్శనాల అశోక్, విఠల్ రెడ్డి , తమ్మల చందు, కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, మహమూద్ ,క్యాతం శివప్రసాద్ రెడ్డి, జైనథ్ మండల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




## ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- **ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సేవలు కీలకం**
- **సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం డిమాండ్**

**పెద్దపల్లి మహా** : ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 13 నుండి చేస్తున్న నిరవధిక ధర్నా కార్యక్రమానికి ఈరోజు ఆయన మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా తాండ్ర సదానందం మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) పరిధిలో వేలాది మంది ఉద్యోగులు అనేక సంవత్సరాలుగా ప్రజలకు నిరంతర వైద్య ఆరోగ్య సేవలు అందిస్తూ ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా కోవిడ్ 19 వంటి క్లిష్ట పరిస్థితుల్లోనూ తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం అంకితభావంతో సేవలందించారని పేర్కొన్నారు. గ్రామీణ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రభుత్వ వైద్య ఆరోగ్య కార్యక్రమాల అమలులో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సేవలు ఎంతో కీలకమని అన్నారు. ఇన్నేళ్లుగా సేవలందిస్తున్నప్పటికీ ఉద్యోగ భద్రత, క్రమబద్ధీకరణ, సమాన పనికి సమాన వేతనం, వేతన సవరణ, కుటుంబ భద్రతతో పాటు ఇతర న్యాయమైన సేవా హక్కుల కోసం వారు పోరాడాల్సి రావడం బాధాకరమన్నారు. ప్రభుత్వం ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా, వారి న్యాయమైన డిమాండ్లను సానుకూలంగా పరిశీలించి తక్షణమే పరిష్కరించాలని కోరారు. ఉద్యోగులకు న్యాయం జరిగే వరకు వారికి అండగా నిలుస్తామని తెలిపారు .ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి కల్లేపల్లి నవీన్, ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ జోనల్ కార్యదర్శి కొమ్ము కొమురయ్య, బుచ్చయ్య, సాయి ఆజాద్, మహేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ పట్టాదారులపై చర్యలు ఎప్పుడూ?

- **పట్టాలు రద్దయినా కేసులు ఎందుకు నమోదు చేయడం లేదు? నాలుగు నెలలుగా ఎదురుచూపులేనా!**
- **మంత్రి అండదండలతోనే అక్రమ పట్టాదారుల చలామణి? చర్యలు తీసుకోవడంలో అధికారుల తాత్సారంపై దళిత సేన నేత ఊట్ల శ్రీను ఆగ్రహం**
- **పేదోడికి ఒక న్యాయం.. పలుకుబడి ఉన్నవారికి మరో న్యాయమా? అధికారులను నిలదీసిన మంథని డివిజన్ దళిత సేన అధ్యక్షుడు**



**పెద్దపల్లి మహా , మంథని**: పెద్దపల్లి జిల్లా మంథని నియోజకవర్గంలోని ముత్తారం మండలం పోతారం గ్రామంలో 59, 113 సర్వే నంబర్లకు సంబంధించిన భూములపై అక్రమ పట్టాల వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. సదరు భూములకు సంబంధించి అక్రమంగా పట్టాలు పొందారనే ఆరోపణలపై కలెక్టర్ వాటిని రద్దు చేసినప్పటికీ, బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవడంలో ఎందుకు జాప్యం జరుగుతోందని మంథని డివిజన్ దళిత సేన అధ్యక్షుడు ఊట్ల శ్రీను అధికారులను ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై నాలుగు నెలలు గడిచినా బాధ్యులపై చర్యలు కనిపించడం లేదని ఆయన ఆరోపించారు. సామాన్యులు తప్పు చేస్తే వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకునే అధికారులు, ఉద్యోగ హోదా లేదా పలుకుబడి ఉన్నవారిపై ఆరోపణలు వచ్చినప్పుడు ఎందుకు అదే వేగంతో స్పందించడం లేదని నిలదీశారు.

**పట్టాలు రద్దు చేసినా చర్యలేవీ?**

పోతారం గ్రామంలోని 59, 113 సర్వే నంబర్ల భూములకు సంబంధించి అక్రమ పట్టాలు పొందినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై విచారణ జరిపి, బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఊట్ల శ్రీను డిమాండ్ చేశారు. ఇప్పటికే పట్టాలు రద్దు చేసినట్లు చెబుతున్న నేపథ్యంలో, సంబంధిత వ్యవహారంలో అక్రమాలకు పాల్పడినట్లు తేలిన వారిపై క్రిమినల్ కేసులు ఎందుకు నమోదు చేయడం లేదని ప్రశ్నించారు. అధికారులకు ఒక న్యాయమా.. పేదలకు మరో న్యాయమా?

"పేదోడు తప్పు చేస్తే జైలుకు పంపిస్తారు.. పలుకుబడి ఉన్నవారు తప్పు చేస్తే మాత్రం ఊళ్లోనే స్వేచ్ఛగా తిరుగుతారా? ఇదెక్కడి న్యాయం?" అంటూ ఊట్ల శ్రీను ఆగ్రహం వ్యక్తం చేశారు. చట్టం ముందు అందరూ సమానమేనని, ప్రభుత్వ భూములు లేదా ప్రజాధనానికి సంబంధించిన అక్రమాలపై ఆరోపణలు వచ్చినప్పుడు ఎలాంటి పక్షపాతం లేకుండా విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.ఈ వ్యవహారంలో చర్యలు తీసుకోకపోవడానికి కారణాలేమిటి? ఎవరి ఒత్తిళ్లైనా ఉన్నాయా? అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాలని ఆయన కోరారు. అయితే, ఈ ఆరోపణలపై సంబంధిత అధికారుల వివరణ వెలువడాల్సి ఉంది.

**చర్యలు తీసుకోకపోతే ఆందోళన**

అక్రమ పట్టాల వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, అక్రమాలకు పాల్పడినట్లు నిర్ధారణ అయిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఊట్ల శ్రీను డిమాండ్ చేశారు. అధికారులు తక్షణమే స్పందించి చట్టపరమైన చర్యలు చేపట్టకపోతే, అతి త్వరలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. ప్రజలకు న్యాయం జరిగేలా సంబంధిత అధికారులు ఈ వ్యవహారంపై స్పష్టమైన ప్రకటన చేసి, తీసుకున్న చర్యలను వెల్లడించాలని ఆయన కోరారు.



## పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవం..

**పోలీసు సిబ్బందికి వ్యాసరచన పోటీలు**
**ప్రజానుకూల పోలీసింగ్, వృత్తిపరమైన నైపుణ్యాల పెంపునకు ప్రత్యేక కార్యక్రమం**

పెద్దపల్లి మహా : రామగుండం: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాన్ని పురస్కరించుకుని రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పోలీసు అధికారులు, సిబ్బందికి శుక్రవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు, అడిషనల్ డీసీపీ (పరిపాలన) కె. శ్రీనివాస్ పర్యవేక్షణలో, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ గోపి ఆధ్వర్యంలో కమిషనరేట్ కార్యాలయంలో ఈ పోటీలు జరిగాయి. పోలీసు సిబ్బందిలో వృత్తిపరమైన నైపుణ్యాలు, సామాజిక బాధ్యత, ప్రజాసేవ పట్ల నిబద్ధతను పెంపొందించడంతో పాటు ప్రజానుకూల పోలీసింగ్‌పై అవగాహన కల్పించడమే ఈ పోటీల ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు. పోటీలను రెండు విభాగాలుగా నిర్వహించారు. కానిస్టేబుల్ నుంచి ఏఎస్ఐ హోదా వరకు సివిల్, ఏఆర్ విభాగాల సిబ్బందికి 'ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలు పోలీసుల నుంచి ఎలాంటి సేవలను ఆశిస్తారు?', 'పోలీసు అధికారుల జీవితాల్లో సోషల్ మీడియా పాత్ర ఏమిటి? దానికి బానిస కాకుండా వ్యక్తిగత, సామాజిక ప్రయోజనాల కోసం ఎలా సద్వినియోగం చేసుకోవాలి?' అనే అంశాలను కేటాయించారు. అదేవిధంగా ఎస్ఐ, ఆర్ఎస్ఐ, అంతకంటే పై హోదా అధికారులకు 'పౌరుల నుంచి గౌరవం, ఆదరణ, సద్భావన పొందేందుకు పోలీసులు ఎలాంటి కృషి చేయాలి?', 'క్షేత్రస్థాయిలో పోలీసింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడం ఎలా?' అనే అంశాలపై వ్యాసాలు రాయాలని సూచించారు. పాల్గొన్న సిబ్బందికి తెలుగు లేదా ఆంగ్ల భాషలో వ్యాసాలు రాసే అవకాశం కల్పించారు. ఇలాంటి కార్యక్రమాలు పోలీసు సిబ్బందిలో ప్రజానుకూల దృక్పథం, జవాబుదారీతనం, వృత్తిపరమైన నిబద్ధతను పెంపొందించేందుకు దోహదపడతాయని అధికారులు పేర్కొన్నారు. పోలీసు విధులు, ప్రజల పట్ల బాధ్యతలు, సమర్థవంతమైన పోలీసింగ్‌పై సిబ్బందికి మరింత అవగాహన కల్పించడంలో ఈ పోటీలు కీలకంగా నిలుస్తాయని తెలిపారు.

## అంకంపల్లిలో రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలి

- **మూడు కిలోమీటర్లు నడిచి రేషన్ బియ్యం తెచ్చుకుంటున్న ప్రజలు.. వృద్ధులు, మహిళలకు తప్పని ఇబ్బందులు**

**పెద్దపల్లి మహా** : కాల్వ శ్రీరాంపూర్ : గ్రామంలో రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలని అంకంపల్లి గ్రామ ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. రేషన్ బియ్యం తీసుకోవాలంటే సుమారు మూడు కిలోమీటర్ల దూరం మడిపల్లి గ్రామానికి నడిచి వెళ్లాల్సి వస్తోందని తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహిళలు వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు రేషన్ బియ్యం కోసం అంత దూరం వెళ్లడం భారంగా మారిందని చెబుతున్నారు. ప్రభుత్వం అంకంపల్లిని నూతన గ్రామపంచాయతీగా ఏర్పాటు చేసిన నేపథ్యంలో గ్రామంలో రేషన్ దుకాణాన్ని కూడా ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. గ్రామపంచాయతీ ఏర్పాటు చేయడంతో గ్రామంలో మౌలిక సదుపాయాలు మెరుగుపడతాయని ఆశిస్తున్న ప్రజలకు రేషన్ దుకాణం లేకపోవడం ఇబ్బందికరంగా మారింది. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని సంబంధిత అధికారులు స్పందించాలని, అంకంపల్లిలోనే రేషన్ దుకాణం ఏర్పాటు చేసి పేదలకు అందుబాటులో బియ్యం పంపిణీ చేయాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రభుత్వం, అధికారులు తక్షణ చర్యలు తీసుకొని తమ కష్టాలను తొలగించాలని కోరుతున్నారు.



## కేటీఆర్‌ను కలిసిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి

**శాలువాతో సత్కరించి..**
**దసరా శుభాకాంక్షలు తెలిపి..**
**పలు అంశాలపై చర్చ**

**కరీంనగర్ మహా :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావును కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్‌కు చెందిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లోనీతెలంగాణ భవన్లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్‌కు దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. పండుగ పురస్కరించుకుని సంప్రదాయబద్ధంగా శాలువాతో సత్కరించి తన అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం కేటీఆర్‌తో పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా పండుగ శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ పరస్పరం ఆత్మీయంగా మాట్లాడుకున్నారు. కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలవడం, దసరా శుభాకాంక్షలు తెలియజేయడం సంతోషంగా ఉందని కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మానకొండూరు నియోజకవర్గంలో పార్టీ బలోపేతంపై చర్చించినట్లు దేవేందర్ రెడ్డి తెలిపారు రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు ఎండగట్టడంతోపాటు పార్టీ బలోపేతంపై మరింత ప్రత్యేక దృష్టి సారిస్తామని చెప్పారు.

## ఈ యాసంగిలో వరికి బదులు ఆరుతడి పంటలు సాగు చేయాలి

- **ఎల్-నినో ప్రభావంతో నీటి కొరతకు అవకాశం.. రైతులు నీటి యాజమాన్య పద్ధతులు పాటించాలి.**
- **పామాయిల్ తోటను సందర్శించిన వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు.**



**పాలకుర్తి మహా, అక్టోబర్ 23:** రాబోయే యాసంగి సీజన్‌లో ఎల్‌నినో ప్రభావం కారణంగా నీటి కొరత ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు సూచించారు. అధిక నీరు అవసరమయ్యే వరి సాగును తగ్గించి, తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. పామాయిల్ సాగుతో రైతులు మెరుగైన ఆదాయం పొందే అవకాశాలున్నాయని తెలిపారు.పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గంలోని పాలకుర్తి మండలం కన్నాల గ్రామ శివారులో రైతు పుప్పాల దయానంద్‌కు చెందిన పామాయిల్ తోటను శుక్రవారం మండల వ్యవసాయ అధికారి బండి ప్రమోద్ కుమార్, ఉద్యాన విస్తరణ అధికారి బోడుకల రాము సందర్శించారు. ఈ సందర్భంగా పామాయిల్ సాగు విధానాలు, నీటి వినియోగం, ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం భూగర్భ జలాలపై ఒత్తిడి పెరుగుతున్న నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని అధికారులు సూచించారు. వరి సాగుకు బదులుగా ఆయిల్ పామ్, కూరగాయలు, పెసర, మినుము, బబ్బెర, ఉలవలు వంటి అపరాల పంటలు, నువ్వులు, వేరుశనగ, పొద్దుతిరుగుడు, కుసుమ వంటి నూనెగింజల పంటలను సాగు చేయాలని తెలిపారు.నీటి వృథాను అరికట్టేందుకు బిందు సేద్యం, తుంపర సేద్యం పద్ధతులను అవలంబించాలని, ఇంకుడు గుంతల నిర్మాణం ద్వారా భూగర్భ జలాల పెంపునకు కృషి చేయాలని సూచించారు. ఉద్యానవన శాఖ ద్వారా రాయితీపై బిందు సేద్యం పరికరాలు అందుబాటులో ఉన్నాయని, ఆసక్తి గల రైతులు ఉద్యాన విస్తరణ అధికారిని సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

**పశుగ్రాసం కొరత రాకుండా ముందస్తు చర్యలు**

రాబోయే రోజుల్లో పశుగ్రాస కొరత ఏర్పడే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకొని వానాకాలం వరి కోతల అనంతరం వరి గడ్డిని తగలబెట్టకుండా గడ్డి చుట్టలుగా బేల్స్ తయారు చేసి నిల్వ చేసుకోవాలని అధికారులు సూచించారు. పచ్చి పశుగ్రాసం కోసం జొన్న, సూపర్ నేపియర్, హెడ్జ్ లూసర్న్, బర్సీమ్, అలసంద, మొక్కజొన్న వంటి పశుగ్రాస పంటలను సాగు చేయాలని కోరారు. బిందు సేద్యం పరికరాల రాయితీ వివరాల కోసం ఉద్యాన విస్తరణ అధికారి బి. రామును 8919896772 నంబరులో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి బండి ప్రమోద్ కుమార్, ఉద్యానవన శాఖ అధికారి బి. రాము, పామాయిల్ రైతులు పుప్పాల దయానంద్, ఎడెల్లి వేణు, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మహా పత్రిక
WWW.MAHAADAILY.COM | జనరల్ వార్తలు | GENERAL NEWS | శనివారం, హైదరాబాద్ | 24-10-2026
ANN తెలుగు



## శారదా దేవి మండపాలను దర్శించిన మున్సిపల్ చైర్‌పర్సన్

**అదిలాబాద్ మహా :** పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపాలను మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్ సందర్శించారు. అమ్మవారి కి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, దసరా నవరాత్రులు భక్తి, ఆధ్యాత్మికత, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలుస్తాయని అన్నారు. దుర్గామాత ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, అదిలాబాద్ పట్టణం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో పండుగలను జరుపుకుంటూ, పరస్పర సోదర భావం, ఐక్యతను కాపాడుకోవాలని కోరారు.

# పోలీస్ రక్తదాన శిబిరానికి భారీ స్పందన

- ఫ్లాగ్ డే సందర్భంగా నిర్వహణ
- రక్తదానం చేసిన 853 మంది
- స్వయంగా రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచిన ఎస్పీ
- దాతలకు కృతజ్ఞతలు, ప్రశంసా పత్రాలు



**ఆదిలాబాద్ మహా:** పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని పోలీసు హెడ్ క్వార్టర్స్ నందు మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ రక్తదాన శిబిరానికి భారీ ఎత్తున స్పందన లభించిందని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్ తెలిపారు. ఇదివరకు ఎన్నడూ లేని విధంగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించి దాదాపు 853 యూనిట్ల రక్తాన్ని ప్రజలు స్వచ్ఛందంగా విచ్చేసి రక్తదాన శిబిరాన్ని విజయవంతంగా పూర్తి చేశారు. శుక్రవారం స్థానిక పోలీసు హెడ్ క్వార్టర్స్ నందు ఏర్పాటు చేయబడిన ఈ మెగా రక్తదాన శిబిరానికి జిల్లా ఎస్పీ ముఖ్యఅతిథిగా పాల్గొని, రిబ్బన్ కట్ చేసి భారీ ఎత్తున ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించడం జరిగింది. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీసు స్టేషన్ల అధికారులు సిబ్బంది జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రజలు భారీ ఎత్తున పాల్గొని అమరవీరుల జ్ఞాపకార్థం వారు చేసిన సేవలను స్మరిస్తూ రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేశారు. ఈ రక్తదాన శిబిరాలలో దాదాపు జిల్లా వ్యాప్తంగా 853 యూనిట్ల రక్తాన్ని పోలీసులు, ప్రజలు, ఔత్సాహికుల రక్తాన్ని రిమ్స్ బ్లడ్ బ్యాంకుకు అందజేసినట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ స్వయంగా రక్తదానాన్ని చేసి సిబ్బందికి స్ఫూర్తిదాయకంగా నిలవడం జరిగింది. రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికి జిల్లా ఎస్పీ స్వయంగా ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. ఈ సందర్భంలో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగా ఈ సంవత్సరం కూడా అమరవీరుల సమస్మరణ వారోత్సవాలను జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నామని, ఒకప్పటి పోలీసులు చేసిన త్యాగాలను జిల్లా ప్రజలకు సవివరంగా వివరించి పోలీసులు చేసే విధులపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఒకప్పటి అమరవీరుల ప్రాణ త్యాగాల ఫలితమే ప్రస్తుత ఆదిలాబాద్ జిల్లా ప్రశాంత వాతావరణ కి కారణమని గుర్తు చేశారు. ప్రజలు వారిని స్మరిస్తూ ఉండాలని, ప్రజలు, పోలీసుల మధ్య సత్సంబంధాలను మెరుగుపరచుకోవడానికి ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తూ ఉండాలని తెలిపారు. వృత్తిరీత్యా పోలీసులు ప్రజల కోసం విధి నిర్వహణలు చేస్తుంటారని, వారిని ప్రజలు గౌరవించాలని, రాత్రనకా, పగలనకా, పండుగలు, కుటుంబ సభ్యులను విడిచి, ప్రజా ధన ప్రాణ మాన రక్షణలో 24 గంటలు పోలీసు యంత్రాంగం విధి నిర్వహణలో ఉంటారని తెలిపారు. జిల్లా అభివృద్ధి పథంలో వెళ్లడానికి సంఘవిద్రోహశక్తులు ఆటంకాలుగా మారుతారని, మారుమూల గ్రామాలను సైతం అభివృద్ధి పథంలో తీసుకువెళ్లడానికి సంఘవిద్రవశక్తులతో పోరాడుతూ జిల్లా పోలీసు వ్యవస్థ అహర్నిశలు కృషి చేస్తుందని గుర్తు చేశారు. రక్తదానం శిబిరం పెద్ద ఎత్తున ప్రజలు పోలీసు సిబ్బంది పాల్గొని విజయవంతం చేశారని తెలిపారు. ఉత్సాహంగా పాల్గొని మహిళలు సైతం రక్తదానాన్ని చేసి పురుషులకు సమానంగా ఆదర్శంగా నిలిచారు. రక్తం అనేది జీవితాలను కాపాడడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని అక్టోబర్ 21 పోలీసు అమరవీరుల దినోత్సవ సందర్భంగా వారి త్యాగాలను గుర్తు చేస్తూ రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ రక్తదాన శిబిరంలో అదనపు ఎస్పీలు పి మౌనిక ఐపీఎస్,బి సురేందర్ రావు, డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, డాక్టర్లు, రిమ్స్ సిబ్బంది, పట్టణ సిఐలు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, రిమ్స్ సిబ్బంది, ఎన్జీవో నాయకులు, ప్రజలు, యువజన సంఘాలు, ప్రైవేటు బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## అన్నిశాఖల సమన్వయంతో గోదావరి పుష్కరాలు

- గడువులోగా పనులను పూర్తి చేయాలి
- బాసరలో కలెక్టర్ అధికారులతో కలిసి పనుల పర్యవేక్షణ
- పలు ఆదేశాలు జారీ చేసిన రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంత రావు

**నిర్మల్ మహా** : గడువులోగా గోదావరి పుష్కరాల పనులను పూర్తి చేయాలని రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంత రావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంత రావు, జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తో కలిసి బాసర లో గోదావరి నది పుష్కరాల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన గోదావరి పుష్కర ఘాట్లను, తదితర పుష్కరాల నిర్మాణ పనుల ప్రదేశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా పుష్కర ఘాట్ల నిర్మాణం చేపట్టాలన్నారు. వేలాది మంది పుణ్యస్నానాలకు తరలివస్తారని, భక్తుల సంఖ్యను దృష్టిలో ఉంచుకొని వారికి అవసరమైన అన్ని రకాల సౌకర్యాలను కల్పించాలన్నారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పుష్కరాల పనులన్నింటినీ గడువులోగా పూర్తి చేయాలన్నారు. పనులు నాణ్యవంతంగా చేపట్టాలని వివరించారు. సంబంధిత శాఖల అధికారులు అంతా ఎప్పటికప్పుడు పుష్కరాల పనులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ ఉండాలని పేర్కొన్నారు. అవసరమైన మేరకు పార్కింగ్ సదుపాయం కల్పించాలని చెప్పారు. పనుల పురోగతి వివరాలను ఎప్పటికప్పుడు తమకు అందజేస్తూ ఉండాలని తెలిపారు. బాసరలో గోదావరి పుష్కరాల పనులన్నీ నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా చెప్పారు. పుష్కరాల పనుల వివరాలను కలెక్టర్ కమిషనర్ కు వివరించారు. వారానికి ఒకరోజు బాసరలో పుష్కర పనులపై సమీక్ష నిర్వహించడంతో పాటు, పనులకు సంబంధించి అధికారులందరికీ దిశా నిర్దేశం చేస్తున్నట్లు తెలిపారు. గోదావరి నది పుష్కరాల పనులను గడువులోగా పూర్తి చేస్తామని వివరించారు. పుణ్యస్నానాలు ఆచరించడానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.అంతకుముందు బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారిని కమిషనర్, కలెక్టర్, అధికారులు దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు అధికారులను సన్మానించి, అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందించారు. ఈ పరిశీలనలో ఇన్ ఛార్జ్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాథోడ్ రమేష్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆర్ అండ్ బి ఈఈ సుభాష్, ఆలయ ఈవో అంజనా దేవి, తహసిల్దార్ పవన్ చంద్ర, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.



## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి..

**మణుగూరు, మహా :** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయడంతో పాటు రెండో విడతలో అర్హులైన నిరుపేద కుటుంబాలను గుర్తించి లబ్ధి చేకూర్చాలని పినపాక ఎమ్మెల్యే, శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. శుక్రవారం మణుగూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి గృహ నిర్మాణ శాఖ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మొదటి విడతలో మంజూరైన ఇళ్ల నిర్మాణాల పురోగతిపై ఆరా తీశారు. పూర్తయిన ఇళ్లు, నిర్మాణ దశలో ఉన్నవి, ఇప్పటికీ ప్రారంభం కాని ఇళ్ల వివరాలతో మండలాల వారీగా సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని సూచించారు. నిర్మాణాల విషయంలో లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి సత్వరమే పరిష్కరించాలన్నారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో గుడిసెల్లో నివసిస్తున్న నిరుపేద కుటుంబాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. నియోజకవర్గంలోని గ్రామాలు, మున్సిపాలిటీల పరిధిలో క్షేత్రస్థాయి సర్వే నిర్వహించి సొంత ఇల్లు లేని అర్హులను గుర్తించాలన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలని, అర్హులకు అన్యాయం జరగకుండా చూడాలని స్పష్టం చేశారు. పేదల సొంతింటి కలను సాకారం చేసే దిశగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, నిర్మాణాల పురోగతిపై ఎప్పటికప్పుడు నివేదికలు అందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో నియోజకవర్గ స్థాయి గృహ నిర్మాణ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# సొంతింటి కల అమలు అయ్యే వరకు పోరాటం ఆగదు

- అక్టోబర్ 25న ఇందిరా పార్క్ వద్ద సీఐటీయూ మహా ధర్నా



**మందమర్రి, మహా** : సింగరేణి కార్మికుల సొంతింటి కల నెరవేరే వరకు పోరాటం ఆపేది లేదని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు స్పష్టం చేశారు. నాడు విద్యుత్ సౌధ వద్ద, నేడు ఇందిరా పార్క్ వద్ద ధర్నాలు చేసైనా కార్మికుల హక్కులను సాధిస్తామని భరోసా పలికారు. గురువారం మందమర్రిలోని కేకే5 గని వద్ద సీఐటీయూ మందమర్రి బ్రాంచి అధ్యక్షులు ఎస్. వెంకట్ స్వామి, ఆ యూనియన్ రాష్ట్ర సెక్రటరీ తుమ్మల రాజారెడ్డి లు కార్మికులను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో సింగరేణికి రావాల్సిన బకాయిల కోసం ఏప్రిల్ లో విద్యుత్ సౌధ వద్ద ధర్నా చేసి విద్యుత్ సంస్థలపై ఒత్తిడి తెచ్చామని గుర్తు చేశారు. అందులో భాగంగానే, ప్రభుత్వ రంగ పరిశ్రమలను కాపాడాలని, కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను, లేబర్ కోడ్లను రాష్ట్రంలో, ప్రభుత్వ రంగ సంస్థలలో అమలు చేయవద్దని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 25 ఆదివారం హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా చేపడుతున్నట్లు ప్రకటించారు. సింగరేణికి రావాల్సిన బకాయిలు చెల్లించాలని ఈ ధర్నాలో డిమాండ్ చేస్తామన్నారు. సీఐటీయూగా గత కొన్నేళ్లుగా కార్మికులను చైతన్యవంతం చేస్తూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం వల్లనే సొంతింటి కలపై ప్రభుత్వం నుండి ప్రకటన వచ్చిందని, కేవలం ప్రకటనతో ఆగకుండా అమలయ్యే వరకు పోరాడుతామని అన్నారు. కార్మికులకు రావాల్సిన ప్రతి పైసాపై నిత్యం పర్యవేక్షిస్తున్నామని, అందులో భాగంగానే సీఎంపీఎఫ్ కు గతంలో తక్కువ కట్టిన వడ్డీ రేటును తిరిగి కట్టించేలా చేశామని తెలిపారు. గత ఆరు నెలలుగా సీఎంపీఎఫ్ బ్యాలెన్స్ తెలపకపోవడంపై గోదావరిఖనిలోని కమిషనర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి వినతిపత్రం ఇచ్చామన్నారు. 12వ వేతన ఒప్పంద కమిటీ ఏర్పాటు, లేబర్ కోడ్ల సవరణపై కోల్ ఇండియా యాజమాన్యం లేఖ రాసినా, తెలంగాణకు చెందిన కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ఇప్పటి వరకు స్పందించకపోవడం విచారకరమన్నారు. పాత అనుమతుల విషయంలో గొప్పలు చెప్పుకునే కేంద్ర, రాష్ట్ర అనుబంధ సంఘాల నాయకులు, కోల్ బెల్ట్ లో తిరిగే రాజకీయ పార్టీల నాయకులు 12వ వేతన కమిటీపై మౌనంగా ఉండటంపై ఆయన విమర్శించారు. రాజకీయాల కోసం బొగ్గు పరిశ్రమకు నష్టం చేయవద్దని హితవు పలికారు. భవిష్యత్తులో జరిగే సింగరేణి ఎన్నికల్లో లేబర్ కోడ్ వల్ల ఏ ఒక్క యూనియన్ గెలిచే పరిస్థితి లేదని, అందుకే కార్మికులు ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా మెజారిటీ యూనియన్లకు ఓటు వేయాలని కోరారు. అనంతరం చలో హైదరాబాద్ ఇందిరా పార్క్ ధర్నా వాల్ పోస్టర్ ను కార్మికుల సమక్షంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ జనరల్ సెక్రటరీ అల్లి రాజేందర్, పిట్ సెక్రటరీ బద్రి ఆదర్శ్, బ్రాంచ్ ఉపాధ్యక్షులు లింగాల సత్యనారాయణ, సంకె. వెంకటేష్, చీకటి వంశీ, చైతన్య రెడ్డి, నవీన్, ప్రశాంత్, కలవల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## మందమర్రి పీ.హెచ్.సీ, ఊరు మందమర్రి ఉప కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా వైద్యాధికారులు

**మందమర్రి, మహా :** మందమర్రి మునిసిపాలిటీలోని పీ.హెచ్.సీ, ఊరు మందమర్రి ఉప కేంద్రాలను మంచిర్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్, ఉప జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధాకర్ నాయక్ లు శుక్రవారం

**ఆకస్మికంగా తనిఖీ చేశారు.**

ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండి, వైద్య సేవలను సమన్వయంతో అందించాలని ఆదేశించారు. పీహెచ్సీలో నమోదు చేస్తున్న రికార్డులు, ఊరు మందమర్రి ఉప కేంద్రంలో అందిస్తున్న వైద్య సేవలు, అంగన్వాడీ కేంద్రంలో గర్భిణీలు, పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని పరిశీలించారు. స్వచ్ఛ భారత్ లో భాగంగా ఉప కేంద్రం పరిధిలో పరిశుభ్రత పాటించాలని సూచించారు.

**క్యాచప్ వ్యాక్సినేషన్, సర్వే కార్యక్రమాలపై సమీక్ష**

జిల్లాలో ఈ నెల 31 వరకు క్యాచప్ వ్యాక్సినేషన్ కార్యక్రమం చేపడుతున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్ తెలిపారు. కొత్తగా వచ్చిన పిల్లలు, టీకాలు తప్పిపోయిన పిల్లలందరికీ వ్యాధి నిరోధక టీకాలు వేయాలని ఆరోగ్య కార్యకర్తలను ఆదేశించారు. ప్రతి కార్యకర్త తమ పరిధిలోని పిల్లల వివరాలు దగ్గర ఉంచుకొని వ్యాక్సినేషన్ సక్రమంగా నిర్వహించాలన్నారు. ఇది పిల్లలకు ఆరోగ్య వరమని పేర్కొన్నారు. అలాగే కుష్టు వ్యాధి నివారణలో భాగంగా జరుగుతున్న సర్వేలో ఉదయం వేళల్లో ఇంటింటికీ వెళ్లి వ్యాధిగ్రస్తులను గుర్తించాలని సూచించారు. వాతావరణ మార్పులతో వచ్చే దగ్గు, జలుబు, వైరల్ జ్వరాలు, మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా వంటి కీటకజనిత వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో సర్పంచులు, పంచాయతీ సిబ్బంది, మున్సిపాలిటీలో కార్పొరేటర్లు, మున్సిపల్ సిబ్బంది సహకారంతో పరిసరాల పరిశుభ్రత చేయించాలని కోరారు. వ్యక్తిగత పరిశుభ్రత, గోరువెచ్చని నీరు తాగడం ద్వారా జలుబు, దగ్గు దూరం చేసుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యురాలు డాక్టర్ లక్ష్మీప్రసన్న, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, సీహెచ్వోలు నామదేవ్, పుట్ట సత్తయ్య, శ్రీనివాస్, అల్లాడి శ్రీనివాస్, విజయ, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

- డీఎస్పీ ఆదినారాయణ హెచ్చరిక
- సఫాయి బస్తి ఏరియాలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్
- 49 వాహనాలపై జరిమానాలు
- 87 మద్యం సీసాలు స్వాధీనం

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ హెచ్చరించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు కొత్తగూడెం 3 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సఫాయి బస్తి ఏరియాలో శుక్రవారం కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ పర్యవేక్షణలో సబ్ డివిజన్ పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో సరైన ధ్రువపత్రాలు లేని 47 ద్విచక్ర వాహనాలు, 2 త్రిచక్ర వాహనాలను గుర్తించి మొత్తం 49 వాహనాలపై చట్టప్రకారం జరిమానాలు విధించారు. అదేవిధంగా 87 ఐఎంఎఫ్ఎల్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ కనెక్ట్ కార్యక్రమంలో భాగంగా డీఎస్పీ ఆదినారాయణ స్థానికులతో మాట్లాడుతూ గంజాయి ఇతర మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు ఎన్‌డీపీఎస్ చట్టం కింద ఎదురయ్యే చట్టపరమైన పరిణామాలపై అవగాహన కల్పించారు. గంజాయి సేవించే వ్యక్తుల గురించి లేదా మాదకద్రవ్యాల అక్రమ రవాణా విక్రయాలకు సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. మాదకద్రవ్యాలకు బానిసైన వారిని గుర్తించి డీఅడిక్షన్ కేంద్రాలకు తరలించి అవసరమైన చర్యలు చేపట్టేందుకు పోలీసులకు సహకరించాలని కోరారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనను నిరంతరం గమనిస్తూ వారు ఎవరితో స్నేహం చేస్తున్నారు.. ఎక్కడికి వెళ్తున్నారు..అనే విషయాలపై తగిన పర్యవేక్షణ ఉంచాలని సూచించారు. పేకాట జూదం మట్కా వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు. సైబర్ నేరాల నియంత్రణలో భాగంగా ఓటీపీ యూపీఐ మోసాలు నకిలీ ఫోన్ కాల్స్ అనుమానాస్పద లింకుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలని ప్రాంతంలో మతసామరస్యాన్ని కాపాడాలని కోరారు.ఈ కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్‌లో సీఐలు ఇంద్రసేనారెడ్డి, జితేందర్‌తో పాటు పోలీసు అధికారులు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.





## పంటల వైవిధ్యీకరణపై ప్రత్యేక దృష్టి సారించాలి

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల, మహా ప్రతినిధి** : మంచిర్యాల జిల్లాలో పంటల వైవిధ్యీకరణను ప్రోత్సహిస్తూ, తక్కువ నీటి వినియోగంతో అధిక దిగుబడులు సాధించే పంటల సాగుపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా వ్యవసాయ అధికారి సురేఖతో పాటు మండల వ్యవసాయ అధికారులతో వ్యవసాయ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, వాతావరణ మార్పుల నేపథ్యంలో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని పంటల సాగు చేపట్టేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమం ద్వారా ఆరుతడి పంటల సాగుపై రైతులకు వివరించాలని, నవంబర్ 30 వరకు జిల్లాలోని అన్ని రైతు వేదికలలో ఈ కార్యక్రమం నిర్వహిస్తామని, రైతులు ఈ అవగాహన సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. మండలాల వారీగా పంటల వైవిధ్యీకరణ ప్రణాళికలు రూపొందించి, గ్రామాల వారీగా రైతులతో సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. తక్కువ నీటితో సాగయ్యే పంటలను ప్రోత్సహిస్తూ, నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉండేలా చూడటంతో పాటు విత్తనాల విక్రయాలపై పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. మొక్కజొన్నకు కనీస మద్దతు ధర, వరి సన్న ధాన్యం, పత్తి కొనుగోలు ప్రక్రియలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించడంతో పాటు కూరగాయల విత్తనాల ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని సూచించారు. కడెం ప్రాజెక్టు నీటిని తాగునీటి అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ వినియోగించాలని, యాసంగిలో విద్యుత్ హెచ్చుతగ్గుల వల్ల పంటలు దెబ్బతినకుండా ఆరుతడి పంటల వైపు రైతులను మళ్లించాలని తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రం సహకారంతో ఆధునిక వ్యవసాయ పద్ధతులు, నీటి పొదుపు సాగుపై శిక్షణలు ఇవ్వాలని, తక్కువ నీటితో విజయవంతంగా సాగు చేస్తున్న రైతులను ఆదర్శంగా చూపి ఇతర రైతులకు స్ఫూర్తినివ్వాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



## తిరుపతి షిరిడికి ప్రత్యేక రైలు ఏర్పాటు చేయండి

- రద్దు చేసిన రైళ్లను తిరిగి తక్షణమే నడిపించాలి
- రైల్వే స్టేషన్ సెంటర్ టు గొల్లగూడెం రోడ్ వెడల్పుకు తక్షణమే స్థలాన్ని కేటాయించాలి
- అభివృద్ధి పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి
- సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు మెంబర్ వై.శ్రీనివాస్ రెడ్డి
- డిఆర్ఎం గోపాలకృష్ణకు విజ్ఞాపన పత్రం

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** తిరుపతి షిరిడికి ప్రత్యేక రైలు ఏర్పాటు చేయాలని రద్దు చేసిన కొల్హాపూర్ కాజీపేట డోర్నకల్ రైళ్లను తిరిగి తక్షణమే నడిపించాలని ఎంపీ రఘురాం రెడ్డి కృషితో మంజూరైన రైల్వే స్టేషన్ సెంటర్ టు గొల్లగూడెం రోడ్ వెడల్పుకు తక్షణమే స్థలాన్ని కేటాయించడంతోపాటుగా కొత్తగూడెం రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సెంట్రల్ రైల్వే బోర్డు మెంబర్ వై.శ్రీనివాస్ రెడ్డి, చాంబర్ ఆఫ్ కామర్స్ నేతలు శుక్రవారం డిఆర్ఎం గోపాలకృష్ణకు వినతి పత్రం అందించి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్తగూడెం రైల్వే అభివృద్ధి పనులు తక్షణమే యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి గోదావరి పుష్కరాల నాటికి ప్రజలకు భక్తులకుఅన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని గతంలో రద్దు చేసిన కొలహపూర్ కాజీపేట డోర్నకల్ రైళ్ళను తిరిగి నడిపించాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన రైల్వే డి ఆర్ ఎం గోపాలకృష్ణ మాట్లాడుతూ తప్పనిసరిగా కొత్తగూడెం రైల్వే స్టేషన్ అభివృద్ధితో పాటుగా రద్దు చేసిన రైళ్లతోపాటు తిరుపతి కి షిరిడికి ప్రత్యేక రైలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం రైల్వే అధికారులతో కలిసి కొత్తగూడెం రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను పర్యవేక్షించి త్వరగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ కొత్తగూడెం అధ్యక్షులు కొదుమూరి శ్రీనివాసరావు, నాయకులు లక్ష్మణ్ అగర్వాల్, సత్యనారాయణ అగ్రవాల్, అనూప్ ఖండేల్వాల్, వందనపు రాము, బిచ్చు అగ్రవాల్, గోపాల్ పంచార్య, సలి దండి రవి, వందనపు సూర్య ప్రకాష్ రావు, రామ్ కుమార్, బండారి నాగేశ్వరరావు, చిట్టిమల్ల చంద్రశేఖరాచారి, కొత్తగూడెంరైల్వే ఏరియా ఏవో కులకర్ణి సుభాష్, ఏరియా ఇన్స్పెక్టర్ పాషా, రైల్వేసీఐ కృష్ణ, ఎస్సై నాగార్జున రెడ్డి, మేనేజర్ విశ్వనాథ్, రైల్వే ట్రాఫిక్ మాజీ ఇన్స్పెక్టర్ ఆర్.చలం, రైల్వే అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం వద్దు..

- మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలి..
- పలు కాలనీల్లో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాదయాత్ర..

**మణుగూరు, మహా** : ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం చేయకుండా మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలని పినపాక ఎమ్మెల్యే, శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం 6 నుంచి 8 గంటల వరకు మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని గాంధీనగర్, కాళీమాత ఏరియా, లెనిన్‌నగర్, ఇందిరానగర్, గోల్డ్‌షాప్‌లైన్, మేదరబస్తీ తదితర కాలనీల్లో వివిధ శాఖల అధికారులతో కలిసి ఆయన పాదయాత్ర నిర్వహించారు. స్థానికులతో మాట్లాడి తాగునీరు, పారిశుద్ధ్యం, డ్రైనేజీ, అంతర్గత రహదారులు, వీధిదీపాలు, విద్యుత్, వర్షపు నీటి పారుదల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా కాలనీల్లో నెలకొన్న సమస్యలను స్వయంగా పరిశీలించి వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు అవసరమైన సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వీధిదీపాల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు తీరుపై స్థానికులను ఆరా తీశారు. సొంత ఇళ్లు లేని నిరుపేదలు, ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న అర్హుల వివరాలను సేకరించాలని గృహ నిర్మాణ శాఖ అధికారులకు సూచించారు. అర్హులైన పేదలకు ప్రభుత్వ నిబంధనల మేరకు సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నామని, మణుగూరు పట్టణంలోని అన్ని కాలనీల అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని, వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, హౌసింగ్ ఏఈ, విద్యుత్, నీటిపారుదల శాఖల అధికారులు, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పోలమూరి రాజు, మండల అధ్యక్షుడు పిరినాకి నవీన్, పట్టణ అధ్యక్షుడు కురం రవి ముదిరాజ్, జిల్లా నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# తీరికలేదు.. ఇక తిరుగుబాటే!

- పట్టభద్రుల ఎమ్మెల్సీ బరిలోకి బ్రదర్ షఫీ
- స్వతంత్ర అభ్యర్థిగా రాజకీయ అరంగేట్రం..
- విద్యావ్యవస్థలో మార్పులు, యువతకు ఉపాధి అవకాశాలే లక్ష్యం
- 80 శాతం పట్టభద్రులు ఓటు నమోదుపై నిర్లక్ష్యం వీడాలి..



**సత్తుపల్లి, అక్టోబర్ 23**:మహా : యువతలో రాజకీయ చైతన్యం పెంపొందించడం, స్వార్థపూరిత రాజకీయాలను ప్రశ్నించడం, విద్యావ్యవస్థలో మార్పులకు కృషి చేయడమే లక్ష్యంగా మోటివేషనల్ స్పీకర్ బ్రదర్ షఫీ రాజకీయాల్లోకి ప్రవేశించేందుకు సిద్ధమయ్యారు. ఖమ్మం-వరంగల్-నల్లగొండ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయనున్నట్లు ప్రకటించారు. 'తీరికలేదు.. ఇక తిరుగుబాటే' అనే నినాదంతో సత్తుపల్లి జమా మసీదు ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన తన లక్ష్యాలను వెల్లడించారు.

**విద్యావ్యవస్థలో మార్పులు**

ప్రైవేటు పాఠశాలలపై ఆధారపడాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వ పాఠశాలల్లోనే ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకోవాలని బ్రదర్ షఫీ అన్నారు. విద్యారంగంపై అవగాహన, ఉన్నత విద్యార్హతలు కలిగిన వ్యక్తిని విద్యాశాఖ మంత్రిగా నియమించాలని అభిప్రాయపడ్డారు. విద్యార్థులందరికీ సమాన అవకాశాలు కల్పించినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు.

**జిల్లాల్లో ఐటీ పరిశ్రమలు.. యువతకు ఉపాధి**

సమాచార సాంకేతిక, విద్యా పరికరాల తయారీ పరిశ్రమలను ప్రధాన నగరాలకే పరిమితం చేయకుండా జిల్లాల్లోనూ అభివృద్ధి చేయాలని షఫీ సూచించారు. స్థానికంగా పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు పెరిగితే యువత ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి తగ్గుతుందని అన్నారు. యువతకు మెరుగైన భవిష్యత్తు కల్పించాలంటే విద్యతోపాటు ఉపాధి రంగంలోనూ మార్పులు అవసరమని పేర్కొన్నారు.

**ఓటు నమోదు విషయంలో నిర్లక్ష్యం వద్దు**

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదు విషయంలో అర్హులు నిర్లక్ష్యం చేయవద్దని బ్రదర్ షఫీ విజ్ఞప్తి చేశారు. ఇప్పటివరకు అర్హులైన పట్టభద్రుల్లో సుమారు 20 శాతం మంది మాత్రమే ఓటు నమోదు చేసుకున్నారని, మిగిలిన 80 శాతం మంది నమోదు ప్రక్రియకు దూరంగా ఉండటం ఆందోళనకరమని అన్నారు. "మన ఒక్క ఓటుతో ఏమవుతుందిలే.." అనే భావనను విడనాడాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటుకూ ప్రాధాన్యం ఉంటుందని, ఒక్క ఓటు కూడా మార్పుకు పునాది కావచ్చని పేర్కొన్నారు. అర్హులైన పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోకపోతే ఎన్నికల ప్రక్రియలో తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేసే అవకాశాన్ని కోల్పోతారని తెలిపారు. యువత, విద్యావంతులు ముందుకు వచ్చి అధికారిక మార్గదర్శకాల ప్రకారం ఓటు నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని పిలుపునిచ్చారు.

**మార్పునకు యువతే కీలకం**

స్వార్థపూరిత రాజకీయాలను ప్రశ్నిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి యువత చొరవ చూపాలని బ్రదర్ షఫీ కోరారు. విద్య, ఉపాధి, యువత భవిష్యత్తు వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయనున్నట్లు తెలిపారు. యువతలో చైతన్యం పెంపొందించడం, ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేయడమే తన రాజకీయ ప్రయాణ లక్ష్యమని వెల్లడించారు.

## ఘన వ్యర్థాల నిర్వహణకు ఆధునిక సాంకేతికతను వినియోగించాలి

**కార్పొరేషన్, మహా** : గ్రేటర్ వరంగల్ నగరంలో తడి, పొడి చెత్తను వేరు చేసిన అనంతరం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో శాస్త్రీయ పద్ధతుల్లో ప్రాసెసింగ్ చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న అధికారులను ఆదేశించారు. శుక్రవారం కమిషనర్ క్యాంపు కార్యాలయంలో ఇంజినీరింగ్, శానిటేషన్ విభాగాల అధికారులు, ఆస్కి ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఘన వ్యర్థాల నిర్వహణపై సమీక్షించారు. వ్యర్థాల ప్రాసెసింగ్‌కు ఆధునిక విధానాలను అనుసరిస్తూ, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా సమగ్ర కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు .ఈ సమావేశంలో సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మహేందర్, ఆస్కి ప్రతినిధి రాజమోహన్ తదితరులు పాల్గొన్నారు.






## జ్ఞానేష్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలి

- అర్హులైన ఓటర్ల హక్కులకు భంగం కలగకుండా చూడాలి
- అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రజా సంఘాల నిరసన.. ఎన్నికల కమిషన్ తీరుపై నాయకుల విమర్శలు

**సత్తుపల్లి, అక్టోబర్ 23**: మహా : ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోయే ప్రమాదం ఉందని ప్రజా సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని, ఆయన రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సత్తుపల్లిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన నిర్వహించి, ఎన్నికల కమిషన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు జాజిరి శ్రీనివాస్, సీఐటీయూ జిల్లా నాయకుడు మోరంపూడి పాండురంగారావు, రైతు సంఘం సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి రావుల రాజబాబు, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు కొలికపోగు సర్వేశ్వరరావు మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వ్యవహరించి ప్రజాస్వామ్యంపై ప్రజలకు విశ్వాసం కల్పించాలని కోరారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయని వారు పేర్కొన్నారు. ఈ ప్రక్రియలో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా ఎన్నికల అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, జాబితాలో మార్పులకు సంబంధించి అభ్యంతరాలు తెలిపేందుకు ఓటర్లకు తగిన అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఓటు హక్కుకు భంగం కలిగించే పొరపాట్లు జరగకుండా చూడాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌పై ఉందని అన్నారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం దెబ్బతినకుండా చర్యలు తీసుకోవాలని, ఈ వ్యవహారంలో రాష్ట్రపతి జోక్యం చేసుకుని జ్ఞానేష్ కుమార్‌ను పదవి నుంచి తొలగించేలా చర్యలు తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు.

**కేంద్ర ప్రభుత్వంపై నాయకుల విమర్శలు**

ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా జ్ఞానేష్ కుమార్‌కు మద్దతుగా నిలుస్తున్నారని నిరసనలో పాల్గొన్న ప్రజా సంఘాల నాయకులు ఆరోపించారు. ఎన్నికల ప్రక్రియపై విద్యార్థులు, యువకులు, ప్రజాస్వామ్యవాదులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని పేర్కొంటూ, కేంద్ర ప్రభుత్వం ఈ అంశంపై స్పందించాలని కోరారు. ఓటర్ల జాబితా సవరణలో పారదర్శకతను నిర్ధారించి, అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కును కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు ఎస్కే వలి, భాస్కర్, మీసాల వెంకట్రావు, వెంకటేశ్వరరావు, రామకృష్ణ, దాట్ల రాంబాబు, మహిళా సంఘం నాయకురాలు పాకలపాటి ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.



## ప్రకాశంఖని ఓసీ4లో అన్నప్రసాద వితరణ..

- అమ్మవారి ఆశీస్సులతో కార్మిక కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలి..

**మణుగూరు, మహా** : ప్రకాశంఖని ఓపెన్‌కాస్ట్ 4లో దసరా నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా శుక్రవారం శ్రీ కనకదుర్గమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన టీబీజీకేఎస్ మణుగూరు ఏరియా ఉపాధ్యక్షుడు నాగెల్లి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గని కార్మికులు, అధికారులు సమష్టిగా ఏటా నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఉత్సవాల అనంతరం అన్నప్రసాద వితరణ చేపట్టడం భక్తిభావానికి, ఐకమత్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. సింగరేణి ఉత్పత్తి లక్ష్యాల సాధనకు నిరంతరం శ్రమిస్తున్న కార్మికులు, అధికారులు, వారి కుటుంబ సభ్యులు అమ్మవారి ఆశీస్సులతో ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్‌తో పాటు అధికారులను, కార్మికులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పీకే నాగరాజు, శ్రీహరి, దారావత్ కృష్ణ, సర్వే నరేష్, పూర్జ చందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



## ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం అందించాలి..

- పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలి..
- పోలీస్‌స్టేషన్లను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్
- మణుగూరులో నూతన భవన నిర్మాణ పనుల పరిశీలన..

**మణుగూరు, మహా** : పోలీస్‌స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ బాధితులకు సత్వర న్యాయం అందించేలా చర్యలు తీసుకోవాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్ పోలీసు అధికారులను ఆదేశించారు. శుక్రవారం కరకగూడెం, ఏడూళ్లబయ్యారం, మణుగూరు పోలీస్‌స్టేషన్లను సందర్శించి తనిఖీలు నిర్వహించారు. పినపాక, అశ్వాపురం పోలీస్‌స్టేషన్లలోనూ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. కరకగూడెం పోలీస్‌స్టేషన్ వార్షిక తనిఖీలో భాగంగా తొలుత డీఎస్పీ రవీందర్‌రెడ్డి ఎస్పీకి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించిన ఎస్పీ స్టేషన్ పరిసరాలు, రికార్డులు, ఆయుధాలు, స్టేషన్ ప్రాపర్టీ, సిబ్బంది కిట్ ఆర్టికల్స్‌ను పరిశీలించారు. నమోదైన కేసులు, పెండింగ్ దర్యాప్తుల పురోగతిపై ఆరా తీశారు. సీసీటీఎన్ఎస్ 2.0లో కేసుల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని సూచించారు. గ్రామాల్లో సైబర్ నేరాలపై అవగాహన కల్పించడంతో పాటు జూదం, కోడిపందాలు, పేకాట, బెట్టింగ్, గంజాయి రవాణా వంటి అసాంఘిక కార్యకలాపాలను అరికట్టాలని ఆదేశించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఏడూళ్లబయ్యారం, మణుగూరు పోలీస్‌స్టేషన్లను సందర్శించిన ఎస్పీ మణుగూరు పోలీస్‌స్టేషన్ ఎదుట నిర్మిస్తున్న మూడు గదుల నూతన భవన నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పోలీస్‌స్టేషన్లలో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంతో పాటు సిబ్బందికి అనుకూలమైన పని వాతావరణం కల్పించాలన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ తనిఖీల్లో డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐలు వెంకటేశ్వర్లు, నాగబాబు, ఎస్సైలు పీవీఎన్ రావు, రహూఫ్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## మరో ఫ్లోరైడ్ సమస్యలా జవహర్ నగర్ డంపింగ్ పరిసర ప్రాంతాలు

- నరకయాతన అనుభవిస్తున్న లక్షలాది పేద ప్రజలు.
- డంపింగ్ యార్డ్ తొలగించే లక్ష్యంగా ఉద్యమ కార్యాచరణ.
- పాదయాత్ర సన్నాహక సమావేశంలో ఈటల రాజేందర్.

**జవహర్ నగర్, మహా** : మరో ఫ్లోరైడ్ సమస్యలా జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ పరిసర ప్రాంతాలు తయారయ్యాయని, ఈ డంపింగ్ యార్డ్ వల్ల నిత్యం లక్షలాదిమంది నరకయాతన అనుభవిస్తున్నారని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు. జవహర్ నగర్ లో ఉన్న డంపింగ్ యార్డ్ తరలింపుకై మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆధ్వర్యంలో దమ్మాయిగూడ లోని ఫంక్షన్ హాల్ లో శుక్రవారం ఉద్యమ కార్యాచరణ పాదయాత్ర సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఈటెల మాట్లాడుతూ డంపింగ్ యార్డ్ ప్రపంచంలోనే అతి కాలుష్య పరమైన వ్యాధులకు నిలయంగా మారిందని, ప్రపంచంలోని అనేక దేశాల్లో వేలాది నగరాల్లో ఉన్న డంపింగ్ యార్డులు నగరాలకు 70 లేదా 80 కిలోమీటర్ల దూరంలో విస్తరించి ఉన్నాయన్నారు. హైదరాబాద్ నగరానికి నడిబొడ్డున జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ ఉండడం సిగ్గుచేటన్నారు. పట్టణీకరణలో వేగంగా అభివృద్ధి చెందుతుందని గొప్పలు చెప్పుకుంటున్న ప్రస్తుత ప్రభుత్వం డంపింగ్ యార్డ్ ను మరిచిపోయి వ్యవస్థను మోసం చేస్తుందని మండిపడ్డారు. ఇకనైనా డంపింగ్ యార్డ్ ఎత్తివేతపై అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. డంపింగ్ యార్డ్ ప్రజల జీవన్మరణ సమస్యగా మారిందని మరో నల్గొండ ఫ్లోరైడ్ గా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డ్ ఎత్తివేసేంతవరకు పోరాటాన్ని విరమించేది లేదని తేల్చి చెప్పారు. 20 లక్షల మంది ప్రజలు డంపింగ్ యార్డ్ వలన నరకం అనుభవిస్తున్నారని, ప్రజల ఆరోగ్యం పర్యావరణ పరిరక్షణ కోసం డంపింగ్ యార్డు తొలగించే లక్ష్యంగా ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు.



## జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్‌పై ఎమ్మెల్యే మల్లారెడ్డి ఆందోళన

**ఆమరణ దీక్షకు సిద్ధమని ప్రకటన**
**కేంద్రంపై ఎంపీ ఈటల వత్తిడి తేవాలని వినతి**

**కుషాయిగూడ, మహా** : మల్కాజ్‌గిరి నియోజకవర్గంలోని జవహర్ నగర్ డంపింగ్ యార్డు పరిస్థితిపై ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి భావోద్వేగానికి గురయ్యారు. త్వరలోనే డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా ఆమరణ నిరాహార దీక్షకు దిగుతానని మల్లారెడ్డి వెల్లడించారు. 'జవహర్ నగర్ నా నియోజకవర్గంలో ఉంది. అది నా గుండె కాయ. జవహర్ నగర్‌పై తాజాగా అమెరికన్ యూనివర్సిటీ విడుదల చేసిన సర్వే ఆందోళన కలిగిస్తోంది. ప్రపంచంలోనే మీథేన్ విషవాయువులు అత్యధికంగా ఉద్గారమవుతున్న ప్రాంతాల్లో జవహర్ నగర్ 4వ స్థానంలో ఉంది. ఈ ప్రాంతంలో రోజుకు ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పద స్థితిలో మరణిస్తున్నారు. వారి మృతికి కారణం తెలియట్లేదు. మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ జవహర్ నగర్ ప్రాంత పరిస్థితిపై కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చి.. అక్కడి డంప్ యార్డ్‌ను వెంటనే తరలించాలి. డంపింగ్ యార్డ్ నిర్వహణ కోసం రాంకీ సంస్థతో 2006లో ఒప్పందం కుదుర్చుకుంటే.. ఆ సంస్థ డంపింగ్ యార్డ్ నిర్వహణను గాలికి వదిలేసి.. ఆ ప్రాంతాన్ని విషవలయంగా మార్చింది' అని ఎమ్మెల్యే మల్లారెడ్డి ధ్వజమెత్తారు.



## అద్దె వాహన డ్రైవర్లకు రూ.5,500 వెంటనే చెల్లించాలి

**ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్. మధుసూదన్‌రెడ్డి డిమాండ్**

**మణుగూరు, మహా** : సింగరేణి అద్దె వాహన డ్రైవర్లతో పాటు ఇప్పటివరకు లాభాల వాటా అందని కాంట్రాక్టు కార్మికులందరికీ ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం ప్రకటించిన రూ.5,500 వెంటనే చెల్లించాలని ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (టీయూసీఐ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్.మధుసూదన్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం మణుగూరు ఏరియాలోని ఓసీ 2లో నిర్వహించిన సింగరేణి అద్దె వాహన డ్రైవర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణిలోని వివిధ విభాగాల కాంట్రాక్టు కార్మికులకు ప్రకటించిన లాభాల వాటా మణుగూరు ఏరియాలోని అద్దె వాహన డ్రైవర్లతో పాటు పలు విభాగాల కార్మికులకు నేటికీ అందలేదని పేర్కొన్నారు. ఈ విషయాన్ని సంబంధిత వాహనాల ఇన్‌చార్జి దృష్టికి తీసుకెళ్లగా చెల్లింపుల ప్రక్రియ ప్రారంభించామని, రెండు రోజుల్లో అందరికీ అందేలా చూస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. యాజమాన్యం ఇచ్చిన హామీ మేరకు రెండు రోజుల్లో పెండింగ్‌లో ఉన్న కార్మికులందరికీ రూ.5,500 చొప్పున చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో సింగరేణి అద్దె వాహన డ్రైవర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్...

**రాజేంద్రనగర్ మహా** ; విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని, శుక్రవారం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ రాష్ట్ర రెవిన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని వారి నివాసంలో కలిసి విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు. కాసేపు నియోజకవర్గ అభివృద్ధిపై పలు అంశాలను చర్చించారు.



## అవస్థలో కాలనీలు అవినీతిలో అధికారులు, ప్రజాప్రతినిధులు

**బడంగ్‌పేట్ మున్సిపల్ కార్యాలయం ఎదుటే అధ్వాన్న రోడ్డు**

**మూడేళ్లుగా బీరప్ప కాలనీ వాసుల అవస్థలు**



**బాలాపూర్, మహా :** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న ప్రధాన రహదారిలో గత మూడు సంవత్సరాలుగా రోడ్డు లేక బీరప్ప కాలనీ వాసులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ సందర్భంగా కాలనీ వాసుడు మణిదీప్ రాజు మాట్లాడుతూ.. రోడ్డు సరిగా లేకపోవడం వల్ల ప్రతిరోజూ రెండు నుంచి మూడు ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై ఇప్పటివరకు బడంగ్‌పేట్ మున్సిపల్ కార్యాలయానికి, జీహెచ్ఎంసీకి ఎన్నిసార్లు వెళ్లి విన్నవించినా పట్టించుకునే నాథుడే లేడని వాపోయారు. "రోడ్లు వేస్తామని, అతి త్వరలో పూర్తి చేస్తామని చెప్పడం మాత్రమే తప్ప ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. రెండు నెలల క్రితం రోడ్డుపై ఉన్న మట్టిని తవ్వించిన అధికారులు, వారం రోజుల్లో పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీ ఇచ్చి రెండు నెలలు కావస్తున్నా ఇప్పటివరకు పనులు ప్రారంభించలేదు," అని మణిదీప్ రాజు తెలిపారు. రెండున్నర సంవత్సరాల క్రితం మంత్రి శ్రీధర్ బాబు మున్సిపల్ కార్యాలయ ప్రారంభోత్సవానికి వస్తున్న సందర్భంగా, కార్యాలయం ఎదురుగా ఉన్న బీరప్ప కాలనీ ప్రారంభంలో కేవలం 100 మీటర్ల మేర మాత్రమే రోడ్డు వేశారని, ప్రారంభోత్సవం జరిగి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నా కాలనీ అంతర్గత రోడ్లను మాత్రం పట్టించుకోలేదని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. వర్షాలు పడినప్పుడు ఈ రోడ్డు పరిస్థితి మరింత దారుణంగా మారుతోందని, గుంతలు కనిపించక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు తెలిపారు. "ఒక్క నాయకుడు కానీ, ఒక్క అధికారి కానీ మా బాధలు పట్టించుకోవడం లేదు. ఎవరికి చెప్పుకోవాలో తెలియక మీడియా మిత్రులను ఆశ్రయించాము. ఇప్పటికైనా అధికారులు స్పందించి మా కాలనీకి న్యాయం చేస్తారని ఆశిస్తున్నాము అని మణిదీప్ రాజు కోరారు.

## వరంగల్ లో ఎమ్మార్వో సంతకం ఫోర్జరీ కలకలం

- నకిలీ ఎఫ్ఎంసి తో భూముల మ్యుటేషన్‌కు యత్నం
- పై నాలుగు సెక్షన్ల కింద కేసు నమోదు
- దర్యాప్తు చేపట్టిన మిల్స్ కాలనీ పోలీసులు

**ఖిలా వరంగల్,మహా :** వరంగల్ జిల్లా తూర్పు నియోజకవర్గం లోని మండల కార్యాలయాల్లో కొంతమంది దళారులు ఏకంగా తహసీల్దార్ సంతకాలతో పాటు ముద్రలను కూడా సృష్టించి భూముల రిజిస్ట్రేషన్ కోసం నకిలీ ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లను తయారు చేసిన ఘటన అప్పట్లో తీవ్ర కలకలం రేపింది. ఈ క్రమంలోనే నకిలీ పత్రాల విషయంలో కొంతమంది నిందితుల పై కేసులు కూడా నమోదు అయ్యాయని తెలుస్తోంది. భూముల మ్యుటేషన్ కోసం నకిలీ ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ సృష్టించిన వ్యవహారం వరంగల్ లో మరోసారి ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ధ్రువపత్రం పై ఖిలా వరంగల్ తహసీల్దార్ సంతకాన్ని ఫోర్జరీ చేయడంతో పాటు నకిలీ ముద్రను ఉపయోగించినట్లు తహసీల్దార్ చేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కరీమాబాద్‌కు చెందిన మెహరున్నీసా బేగం పై ఏజే మిల్స్ కాలనీ పోలీసులు నాలుగు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.ఎఫ్ఐఆర్ నంబర్ 780/2026 తో అక్టోబర్ 17, 2026న రాత్రి 10 గంటలకు కేసు నమోదైంది. ఖిలా వరంగల్ తహశీల్దార్ ఎం.డి. ఇక్బాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు భారతీయ న్యాయ సంహిత సెక్షన్లు



Office of the Tahsildar, Khila Warangal (M)

Rc.No.C/2913/2026
From
Sri. Md Iqbal
Tahsildar, Khila Warangal

Dated:17/10/2026
To
Station House Officer
Police Station, Mills Colony

Sir,

Sub: Revenue Department - Alleged Forgery and use of a Fake Family Member Certificate by Smt. Meherunnisa Begum W/o Late Mohammed Abdul Raheem - Kareemabad Village - Khila Warangal Mandal - Request to file criminal case against the individual - Reg.

Ref:- 1. The Tahsildar, Athmakur, Bhongiri District Rc.No. A/437/2026, Dt: 09.10.2026.
2. Fake Family Member Certificate bearing D.Dis.No. C/3223/2026, Dt: 08.01.2026, allegedly obtained in the name of Smt. Meherunnisa Begum.
3. Report of the Mandal Girdawar, Khila Warangal Dt: 09.10.2026.

&&&

I invite attention to the reference 1st cited, The Tahsildar Athmakur(M) Bhongir District has requested to verify the genuineness of the Family Member Certificate bearing D.Dis.No. C/3223/2026, Dt: 08.01.2026 said to be issued by Tahsildar, Khila Warangal in the name of Smt. Meherunnisa Begum, W/o Late Abdul Raheem, R/o H.No. 16-1-881, Kareemabad, Khila Warangal, Kareemabad Village, Khila Warangal Mandal, Warangal District.

In this connection, it is to inform that on verification of Office Records and Distribution Register pertains to Year - 2026, it revealed that this office has not issued any Family Member Certificate bearing D.Dis.No.C/3223/2026, dated 08.01.2026, in favour of Smt. Meherunnisa Begum, W/o Late Abdul Raheem, R/o Karemabad Village, Khila Warangal Mandal and the Family Member Certificate mentioned in reference 1st cited is Tampered and Fake Family Member Certificate.

It is further informed that based on the verification of Family Member Certificate which was forwarded by the Tahsildar, Athmakur, Yadadri Bhuvanagiri District it is clearly established that the family members of the deceased i.e Jainabee, Mohammad Abdul Raheem, Meharunisa Begum, Mohammad Parveen created fake and fabricated family member certificate without mentioning the other and actual family members of the deceased person and trying to mutate the prime agriculture lands with use of fake family member certificate and there is a need to conduct detailed investigation by the Police Department to avoid further fake certificates for different purposes. Further it is also noticed that they also forged signatures of Tahsildar, Khila Warangal and used office seal for creating fake family member certificate.

In view of the above facts, I request to file a criminal case against Smt. Meherunnisa Begum W/o Late Abdul Raheem, R/o 16-1-881, Kareemabad, Khila Warangal and take further action against her under the suitable provisions of law.

Encl: As above

Yours faithfully,
Tahsildar,
Khila Warangal
Tahsildar
Khila Warangal
Warangal Dist

Copy submitted to the District Collector, Warangal for favour of kind information.
Copy submitted to the Revenue Divisional Officer, Warangal for kind information.

Scanned with OKEN Scanner

318(4), 336(3), 340(2), 337 కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ శివరాత్రి మహేష్ దర్యాప్తు చేస్తున్నారు. కరీమాబాద్ కు చెందిన మెహరున్నీసా బేగం తన భర్త దివంగత మహమ్మద్ అబ్దుల్ రహీం పేరుతో ఉన్నట్లు పేర్కొంటూ ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ ను ఆత్మకూరు తహసీల్దార్ కు సమర్పించారు. సర్టిఫికెట్ నంబర్ సి/3223/2026, తేదీ 0801 2026గా ఉంది. దీని ప్రామాణికత పై అనుమానం రావడంతో ఆత్మకూరు తహసీల్దార్ ఖిలా వరంగల్ తహశీల్దార్ కార్యాలయాన్ని వివరణ కోరగా అసలు వ్యవహారం బయటపడింది.

**జారీ చేయని ధ్రువపత్రం**

వరంగల్ తూర్పు నియోజకవర్గం లోని ఖిలా వరంగల్ మండలం తహసీల్దార్ కార్యాలయంలోని రికార్డులు, పంపిణీ రిజిస్టర్ ను పరిశీలించగా, 2026లో ఆ నంబరుతో ఎలాంటి ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ జారీ కాలేదని తేలినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో సదరు ధ్రువపత్రం నకిలీదిగా గుర్తించినట్లు అధికారులు తెలిపారు. తహసీల్దార్ సంతకం, కార్యాలయ ముద్రను కూడా నకిలీగా ఉపయోగించినట్లు ఫిర్యాదులో వివరించారు. ఇతర వారసుల పేర్లను చేర్చకుండా నకిలీ ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ సృష్టించి, ప్రధానమైన వ్యవసాయ భూములను తమ పేర్లపైకి మ్యుటేషన్ చేయించుకునేందుకు ప్రయత్నించినట్లు తహసీల్దార్ తన ఫిర్యాదులో ఆరోపించారు. ఈ వ్యవహారంలో జైనాబీ, మహమ్మద్ అబ్దుల్ రహీం, మెహరున్నీసా బేగం, మహమ్మద్ పర్వేజ్ పేర్లను ప్రస్తావించారు.

**క్షేత్రస్థాయిలో దర్యాప్తు చేస్తున్న పోలీసులు**

ఖిలా వరంగల్ మండల తహశీల్దార్ ఎం.డి. ఇక్బాల్ ఆర్‌సీ నంబర్ సి/2912/2026తో అక్టోబర్ 17న ఏజే మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ అధికారులకు లేఖ రాశారు. మెహరున్నీసా బేగం (ఇంటి నంబర్ 16 1881, కరీమాబాద్) పై క్రిమినల్ కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. కేసు నమోదు చేసిన పోలీసులు ఈ ధ్రువపత్రం తయారీ వెనుక మరెవరైనా ఉన్నారా? ఇలాంటి నకిలీ పత్రాలు మరిన్ని సృష్టించారు? అనే కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు.




## గంజాయి పాపి స్ట్రా సరఫరా చేసే వ్యక్తి అరెస్ట్..

**అతని వద్ద మారుణ ఆయుధాలు స్వాధీనం..**

**రాజేంద్రనగర్ మహా ;** అత్తాపూర్ పరిధిలో ని సీఖ్ చౌనీలో పక్క సమాచారంతో ఓ ఇంట్లో రాజేంద్రనగర్ పోలీసులు సిఐ నజీర్ పాషా, దూల్పేట సీఐ ప్రవీణ్ కుమార్ తన సిబ్బంది తో కలిసి ఆకస్మిక దాడులు నిర్వహించారు. దాడులో గంజాయి విక్రయిస్తున్న సర్దార్ రాజాసింగ్ (39 ) యువకుని నుండి 1.5 కేజీ ఎండిగంజాయి, 1.13 కేజీ పప్పీస్ట్రా, ఒక రివాల్వర్, రెండు పిస్తోల్స్, ఐదు రౌండ్ల బుల్లెట్స్ ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పాపిస్ట్రా, నాందేడ్ నుంచి గంజాయి మంగళాట్ నుంచి కొనుగోలు చేసి కావలసిన వ్యక్తులకు అమ్ముతున్నాట్లు పోలీసులు తెలిపారు. నిందితుని ఇంటి పై దాడులు నిర్వహించి నిందితుని అదుపులోకి తీసుకున్నారు.అతని వద్ద నుంచి మరుణ ఆయాధలను స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు.




## గంజాయి ముఠా గుట్టు రట్టు..!

- మహేశ్వరం ఎస్ఓటీ మంచాల పోలీసుల స్పెషల్ డ్రైవ్
- పోలీసుల అదుపులో ఇద్దరు నిందితులు!
- స్విగ్గి డెలివరీ బ్యాగుల్లో మత్తు పదార్థాల సరఫరా

**ఇబ్రహీంపట్నం అక్టోబర్ 23 మహా:** స్విగ్గీ ఫుడ్ డెలివరీ బాయ్స్ ముసుగులో గంజాయి డోర్ డెలివరీ చేస్తున్న ఇద్దరు నిందితులను మహేశ్వరం ఎస్ఓటీ, మంచాల పోలీసులు సంయుక్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించి నిందితులను అరెస్టు చేశారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం పరిసర ప్రాంతాల్లో ఈ ఘటన చోటు చేసుకుంది. ఆంధ్రప్రదేశ్ అరకుకు చెందిన వ్యక్తి నుంచి మరో ఇద్దరు విజయవాడలో గంజాయిని కొనుగోలు చేసి హైదరాబాద్ చేరుకున్నారు. ఎవరికి అనుమానం రాదనే ఉద్దేశంతో స్విగ్గీ బ్యాగులను సాధనంగా ఎంచుకున్నారు. స్విగ్గి డెలివరీ బాయిల ముందుగా బుక్ చేసుకున్న వారికి కాలనీల్లో తిరుగుతూ, గుట్టుగా గంజాయిని ఇంటి వద్దకు తెచ్చి వేయింగ్ మెషిన్‌ను వినియోగిస్తు విక్రయిస్తున్నారు. ఫుడ్ డెలివరీ ముసుగులో అక్రమ వ్యాపారం సాగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో మహేశ్వరం ఎస్ఓటీ పోలీసులు నిఘా పెట్టారు. పక్కా సమాచారంతో మంచాల పోలీసులతో కలిసి సంయుక్తంగా దాడి చేసి ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి 1.1 కిలోల గంజాయి, ఒక ద్విచక్ర వాహనం, డిజిటల్ వేయింగ్ మెషిన్, రెండు మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు..

## అనుమతి లేకుండా టపాసులు, బాంబులు విక్రయిస్తే చట్టరిత్యా చర్యలు

- హసన్పర్తి ఇన్స్పెక్టర్ ఎ. మహేందర్ హెచ్చరిక



**హసన్పర్తి, మహా :** రానున్న దీపావళి పండుగను పురస్కరించుకొని హసన్పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎవరైనా ఎలాంటి ముందస్తు అనుమతులు లేకుండా అక్రమంగా క్రాకర్స్ (టపాసులు) గానీ, బాంబులు గానీ నిల్వ ఉంచిన లేదా విక్రయించిన వారి పై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోబడతాయని హసన్పర్తి ఇన్స్పెక్టర్ ఎ. మహేందర్ శుక్రవారం ఓ ప్రకటన ద్వారా హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పండుగ వేళ ప్రజల భద్రత దృష్ట్యా ప్రతి ఒక్కరూ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని సూచించారు. బాణసంచా విక్రయాలు జరపాలనుకునే వ్యాపారులు తప్పనిసరిగా ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం సంబంధిత అధికారుల నుండి ముందస్తు అనుమతులు (లైసెన్స్) పొందాలని స్పష్టం చేశారు.

**ముఖ్యమైన సూచనలు**

నివాస ప్రాంతాల మధ్య, అనుమతి లేని ప్రదేశాలలో బాణసంచా నిల్వ ఉంచడం పూర్తిగా నిషిద్ధమని, నిబంధనలు ఉల్లంఘించి బాంబులు, క్రాకర్స్ అక్రమంగా కలిగి ఉన్నవారి పై ప్రత్యేక నిఘా ఉంచడం జరుగుతుందని తెలిపారు.

**క్రిమినల్ కేసులు**

ముందస్తు అనుమతి లేకుండా నిల్వ ఉంచినట్లు గుర్తిస్తే సరుకును సీజ్ చేయడమే కాకుండా, బాధ్యుల పై చట్ట ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ప్రజలు, వ్యాపారులు పోలీసులకు సహకరించి, సురక్షితమైన వాతావరణంలో దీపావళి పండుగను జరుపుకోవాలని ఇన్స్పెక్టర్ మహేందర్ ప్రకటనలో కోరారు.



## వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ కు మోక్షం ఎప్పుడు?

- సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఓపీ సేవలు వాయిదా
- ఆవిరైనా మంత్రుల హామీ.. వరంగల్ ప్రజలను నిరాశపరిచిన దసరా
- ఓపి త్వరలోనే ప్రారంభం అంటున్న అధికారులు

**వరంగల్, బ్యూరో మహా :** ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజల చిరకాల స్వప్నమైన మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభం మళ్లీ కష్టంగా మారింది. దసరా కానుకగా అక్టోబర్ 20న ఓపీ సేవలు ప్రారంభిస్తామని మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క హామీ ఇచ్చినా, ఆ హామీ నిలబెట్టుకోలేకపోయారు. ఓపీ సేవల ప్రారంభం వాయిదా పడటంతో ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజల ఆశలు ఆవిరయ్యాయి. వరంగల్ జిల్లా ప్రజలకు మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభం కలగానే మిగిలిపోతోంది. వారం రోజుల క్రితం మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మంత్రి సీతక్క, స్థానిక ఎమ్మెల్యేలు హాస్పిటల్ ను పర్యటించి, పరిశీలించారు. అక్టోబర్ 20న దసరా కానుకగా ఓపీ సేవలు సాఫ్ట్ లాంచ్ చేస్తామని మీడియా ముఖంగా ప్రకటించారు. దీంతో వరంగల్ ప్రజలు ఎంతో ఆశగా ఎదురు చూశారు. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు దసరాకు అందుబాటులోకి వస్తాయని సంబరపడ్డారు. కానీ అక్టోబర్ 20 తేదీ వచ్చినా ఓపీ సేవలు ప్రారంభం కాలేదు. అధికారులు మళ్లీ త్వరలో ప్రారంభమవుతుంది" అంటూ మాట దాటవేస్తున్నారు. మంత్రులు పర్యటించి, ప్రారంభిస్తామని చెప్పి మళ్లీ వాయిదా వేయడం ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గత కొన్ని నెలలుగా "ఇప్పుడు, అప్పుడు" అంటూనే కాలయాపన చేస్తున్నారని, ఇంకా ఎన్ని సంవత్సరాలు ఎదురు చూడాలని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు ఎంజీఎం ఆస్పత్రిలో సరైన సదుపాయాలు లేక రోగులు ఇబ్బందులు పడుతుంటే, మరోవైపు కోట్ల రూపాయలతో నిర్మించిన సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ను ప్రారంభించకపోవడం దారుణమని విమర్శిస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి, వాయిదాల పర్వానికి తెరదించి, వెంటనే ఓపీ సేవలు ప్రారంభించాలని, వరంగల్ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రజలు, ప్రజా సంఘాలు కోరుకుంటున్నారు.



## మన్నెగూడలో ముమ్మరంగా వాహన తనిఖీలు...

- నిబంధనలు పాటించాలన్న ఎస్ఐ సైదయ్య

**ఆదిభట్ల సర్కిల్ అక్టోబర్ 23 మహా:** ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని మన్నెగూడలో వాహన తనిఖీలు ముమ్మరంగా చేపట్టారు. జిహెచ్ఎంసి ఆదిభట్ల సర్కిల్ పరిధిలోని మన్నెగూడలో వాహనాల తనిఖీలు, ఎస్ఐ సైదయ్య బృందంతో ముమ్మరంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారుల ధ్రువపత్రాలను పరిశీలిస్తూ, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పోలీసులు సూచించారు. వాహనదారులు హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, రహదారి భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ నర్సింహా గౌడ్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మద్యానికి బానిసై వ్యక్తి మృతి



**మట్వాడ, మహా ;** వరంగల్ మట్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం అలవాటు వల్ల తీవ్ర అనారోగ్యానికి గురై లారీ మెకానిక్‌గా పనిచేస్తున్న చెన్నూరి హరి (46) అనే వ్యక్తి మృతి చెందినట్లు మట్వాడ పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. వరంగల్ మట్వాడ ప్రాంతానికి (ఇంటి నంబర్ 154312/1) చెందిన చెన్నూరి కావ్య (41) భర్త అయిన హరికి తీవ్రంగా మద్యం తాగే అలవాటు ఉంది. కావ్య ఈ నెల 16 10 2026 శనివారం పండుగ సందర్భంగా బండపల్లిలోని తన తల్లిదండ్రుల ఇంటికి వెళ్లగా, హరి ఇంట్లోనే ఒక్కడే ఉన్నాడు. ఈ క్రమంలో ఈరోజు 23 **10 2026 మధ్యాహ్నం సుమారు 2**:00 గంటల సమయంలో పక్కింటి మహిళ అయిన చేరాల అను ఆమె కావ్యకు ఫోన్ చేసి, హరి ఇంటి ముందు పడిపోయాడని, 108 సిబ్బంది వచ్చి పరిశీలించి అతను చనిపోయినట్లు ధృవీకరించారని సమాచారం ఇచ్చింది. వెంటనే కావ్య వచ్చి చూడగా హరి నిరంతరం మద్యం సేవించడం వల్లే తీవ్ర అస్వస్థతకు గురై మరణించినట్లు నిర్ధారణ అయింది. భర్త మరణం పై తనకు ఎలాంటి అనుమానాలు లేవని, శవ పంచనామా నిర్వహించి మృతదేహాన్ని తమకు అప్పగించాలని మృతుడి భార్య చెన్నూరి కావ్య మట్వాడ ఇన్స్పెక్టర్ ఎన్ కరుణాకర్ రావు కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

## అంగన్‌వాడీ సేవల పై ప్రత్యేక దృష్టి సారించాలి

- అంగన్ వాడీ కేంద్రాలను సందర్శించి పనితీరును మెరుగుపరచాలి
- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- ఎల్‌నినో నేపథ్యంలో ముందస్తు చర్యలు చేపట్టాలి



**వరంగల్, కలెక్టరేట్ మహా :** వరంగల్ జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల పనితీరును మెరుగుపరచడంతో పాటు చిన్నారుల ఆరోగ్యం, పోషణ, ప్రీస్కూల్ విద్య, మహిళా శిశు సంరక్షణ సేవల పై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐసీడీఎస్ పరిధిలోని సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, జిల్లా సంక్షేమ అధికారితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు, ప్రీస్కూల్ విద్య, చిన్నారుల ఆరోగ్యం, మహిళలు, శిశువుల సంరక్షణ తదితర అంశాలపై సమీక్షించారు. సెప్టెంబర్ నెలలో సూపర్‌వైజర్లు నిర్వహించిన అంగన్‌వాడీ కేంద్రాల సందర్శనలను సమీక్షించిన కలెక్టర్, రాబోయే రెండు నెలల్లో జిల్లాలోని ప్రతి అంగన్‌వాడీ కేంద్రాన్ని తప్పనిసరిగా సందర్శించి, లోపాలను గుర్తించి పనితీరును మెరుగుపరిచేలా చర్యలు తీసుకోవాలని సీడీపీవోలను ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ పిల్లల హాజరును పెంచాలని, అంగన్‌వాడీ టీచర్లు ప్రీస్కూల్ కార్యకలాపాలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. పిల్లలను కేంద్రాలకు తీసుకురావడంలో అంగన్‌వాడీ ఆయాలు చొరవ చూపాలని స్పష్టం చేశారు. జిల్లాలోని 447 స్నేహ క్లబ్‌లలో 4,000 మందికి పైగా కిశోర బాలికలు ఉన్న నేపథ్యంలో, సూపర్‌వైజర్లు ఆయా క్లబ్‌లను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. బాల్యవివాహాలు, బాలలపై వేధింపులు తదితర అంశాలపై బాలికలకు అవగాహన కల్పిస్తూ, వారి రక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. వికలాంగుల అవసరాలను గుర్తించి, అర్హులైన చిన్నారులను భవిత కేంద్రాలకు అనుసంధానం చేయాలని కలెక్టర్ తెలిపారు. చిన్నారులకు నిర్ణీత షెడ్యూల్ ప్రకారం టీకాలు అందించడం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. ఎన్‌హెచ్‌ఎం సిబ్బంది సమ్మె నేపథ్యంలోనూ ఏ చిన్నారికి టీకాలు మిస్ కాకుండా సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో సమన్వయం చేసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు క్షేత్రస్థాయిలో గృహ సందర్శనలు సమర్థవంతంగా నిర్వహించాలని, మహిళలు, చిన్నారుల ఆరోగ్యం, పోషణ, సంరక్షణ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

**ఎల్‌నినో ప్రభావంతో అప్రమత్తంగా ఉండాలి**

ఎల్‌నినో ప్రభావాల నేపథ్యంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో అధిక ఉష్ణోగ్రతల ప్రభావాన్ని తగ్గించేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సూచించారు. తాగునీటి లభ్యతను నిర్ధారించడంతో పాటు చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహార సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని జిల్లా సంక్షేమ అధికారిని ఆదేశించారు. ఎండ తీవ్రత నుంచి చిన్నారులను రక్షించేందుకు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో తాగునీరు, పోషకాహార సరఫరా పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వైవి గణేష్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి రాజమణి, సంబంధిత సీడీపీవోలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

## భూ రీసర్వే పనులను పరిశీలించిన ఆర్డీఓ సుమ

**వరంగల్, మహా :** వరంగల్ జిల్లాలో భూ రీసర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేందుకు రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పనుల పురోగతిని పరిశీలిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం వరంగల్ ఆర్డీఓ సుమ, వరంగల్ తహశీల్దార్ శ్రీకాంత్ లు కొత్తపేట గ్రామాన్ని సందర్శించి అక్కడ చేపడుతున్న భూ రీసర్వే పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో రీసర్వే ప్రక్రియ కొనసాగుతున్న తీరును, ఇప్పటివరకు చేపట్టిన పనుల పురోగతిని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి భూములకు సంబంధించిన వివరాల సేకరణ, భూ సరిహద్దుల గుర్తింపు, రీసర్వేకు సంబంధించిన ఇతర అంశాలను ప్రస్తుత పరిస్థితిని రైతుల నుంచి తెలుసుకున్నారు. భూ రీసర్వే ద్వారా భూముల వివరాలను స్పష్టంగా నమోదు చేయడంతో పాటు భూ సరిహద్దుల విషయంలో పారదర్శకతను పెంపొందించేందుకు అవకాశం ఉంటుంది. భూ రికార్డుల్లో స్పష్టత తీసుకురావడం, భవిష్యత్తులో భూ సంబంధిత వివాదాలకు అవకాశం లేకుండా చూడటం ఈ ప్రక్రియ ప్రధాన లక్ష్యమన్నారు. ఈ రీసర్వే లో ఆర్డీవో వెంట రెవెన్యూ, లాడ్ సర్వే రికార్డ్స్ అధికారులు, సర్వేయర్లు రైతులు ఉన్నారు.



## పశ్చిమలో జోరుగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

**తాజా మాజీ కార్పొరేటర్ మామిండ్ల రాజు**

**హనుమకొండ, మహా :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గం లోని న్యూ శాయంపేట 31వ డివిజన్ పరిధిలో వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ నేపథ్యంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి హనుమకొండ డిసిసి కాంగ్రెస్ అధ్యక్షులు ఇనగాల వెంకట్రాంరెడ్డి, ఆదేశాల మేరకు రాష్ట్ర పిసిసి మెంబర్ బట్టి శీనన్న సూచన మేరకు 31వ డివిజన్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార కార్యక్రమానికి తాజా మాజీ కార్పొరేటర్ మామిండ్ల రాజు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తూ, అర్హులైన ప్రతి పట్టభద్ర ఓటరును కలిసి ఓటరు జాబితాలో తమ పేరు ఉందో లేదో పరిశీలించుకోవాలని, ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించాలని సూచించారు. వరంగల్, ఖమ్మం నల్లగొండ, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రామిరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారం, యువత భవిష్యత్తు, న్యూ శాయంపేట అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తామని అర్హులైన ప్రతి పట్టభద్రుడు తన ఓటు హక్కును వినియోగించుకునేలా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఇన్చార్జి మార్క విజయ్, డివిజన్ అధ్యక్షులు సత్తు రమేష్, మాజీ అధ్యక్షులు అంకేశ్వర్ సురేందర్, నాగనబోయిన బాబురావు, శీలం శ్రీనివాస్, ఎమ్మెల్సీ డివిజన్ ఇన్చార్జి డిసిసి మెంబర్ మామిండ్ల సురేష్, డివిజన్ సీనియర్ నాయకులు యూత్ నాయకులు కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

### రెడ్ క్రాప్ టాప్‌లో మిర్నా..

## స్టైలిష్ లుక్‌తో ఆకట్టుకుంటున్న బ్యూటీ!

సినీ తారలు తమ నటనతోనే కాకుండా ఫ్యాషన్ ఎంపికలతోనూ అభిమానులను ఆకట్టుకుంటుంటారు. ముఖ్యంగా వెస్ట్రన్ దుస్తుల్లో కనిపిస్తూ కొత్త స్టైల్ ట్రెండ్స్‌ను పరిచయం చేస్తుంటారు. ఈ క్రమంలో నటి మిర్నా తన స్టైలిష్ లుక్‌తో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. రెడ్ క్రాప్ టాప్, హై వెయిస్టెడ్ జీన్స్ కలయికతో కూడిన ఆమె లుక్ ఫ్యాషన్ ప్రియులను ఆకట్టుకునేలా ఉంది. ఎరుపు రంగు క్రాప్ టాప్‌కు బ్లూ డెనిమ్ జీన్స్‌ను జత చేయడం ఈ లుక్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. సాధారణంగా కనిపించే దుస్తులనే సరైన కలయికతో ఎంచుకుంటే స్టైలిష్‌గా కనిపించవచ్చనే విషయాన్ని ఈ ఫ్యాషన్ ఎంపిక గుర్తుచేస్తోంది. రెడ్ కలర్ అవుట్‌ఫిట్‌కు ప్రత్యేకమైన ఆకర్షణ ఉండగా, బ్లూ జీన్స్ ఆ లుక్‌కు క్యాజువల్ టచ్‌ను అందిస్తున్నాయి. హై వెయిస్టెడ్ జీన్స్ ప్రస్తుతం మోడ్రన్ ఫ్యాషన్‌లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నాయి. క్రాప్ టాప్‌తో వీటిని జత చేసుకోవడం వల్ల సమకాలీన వెస్ట్రన్ లుక్‌ను సులభంగా పొందవచ్చు. రోజువారీ విహారాలు, స్నేహితులతో సమావేశాలు, క్యాజువల్ ఫోటోషూట్స్ వంటి సందర్భాలకు ఇలాంటి దుస్తుల కలయికను చాలామంది ఇష్టపడుతుంటారు. ఫ్యాషన్‌లో ఎప్పుడూ ఖరీదైన దుస్తులే ప్రత్యేకతను తీసుకురావాల్సిన అవసరం లేదు. రంగుల ఎంపిక, దుస్తుల అమరిక, వాటికి సరిపోయే యాక్సెసరీలు కూడా మొత్తం లుక్‌ను ప్రభావితం చేస్తాయి. రెడ్ టాప్, డెనిమ్ జీన్స్ వంటి సాధారణ దుస్తులతోనూ ఆకర్షణీయమైన స్టైల్‌ను సొంతం చేసుకోవచ్చు. సందర్భానికి తగిన ఫుట్‌వేర్, మినిమల్ జ్యువెలరీని ఎంచుకుంటే ఈ తరహా అవుట్‌ఫిట్ మరింత అందంగా కనిపిస్తుంది. మిర్నా ఎంచుకున్న ఈ దుస్తుల కలయిక వెస్ట్రన్ ఫ్యాషన్‌ను ఇష్టపడేవారికి మంచి స్టైల్ ఐడియాగా నిలుస్తుంది. ఎరుపు రంగు టాప్‌తో డెనిమ్ జీన్స్‌ను జత చేయడం ద్వారా సింపుల్‌గా, ట్రెండీగా కనిపించవచ్చు. తమ వార్డ్‌రోబ్‌లో ఉన్న దుస్తులతో కొత్త కలయికలను ప్రయత్నించాలనుకునేవారికి ఇలాంటి స్టైలింగ్ ఉపయోగకరంగా ఉంటుంది.



# పవన్ కళ్యాణ్ ‘ఓజీ’ వెనుక త్రివిక్రమ్.. తమన్ ఆసక్తికర వ్యాఖ్యలు!

ప్రముఖ సంగీత దర్శకుడు తమన్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం టాలీవుడ్‌లో ఆసక్తికరంగా మారాయి. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటించిన ‘ఓజీ’ సినిమా గురించి ఆయన చేసిన వ్యాఖ్యలు అభిమానుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. తాజాగా ‘ఆదర్శ కుటుంబం’ సినిమా ట్రైలర్ లాంచ్ కార్యక్రమంలో పాల్గొన్న తమన్.. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్, దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ‘ఓజీ’ ప్రాజెక్ట్ గురించి మాట్లాడిన ఆయన, ఈ సినిమా సాధ్యం కావడంలో త్రివిక్రమ్ పాత్ర ఎంతో ప్రత్యేకమని పేర్కొన్నారు. తమన్ మాట్లాడుతూ, పవన్ కళ్యాణ్ అభిమానులు ‘ఓజీ’ పేరు ప్రస్తావించిన ప్రతిసారీ తనకు త్రివిక్రమ్ శ్రీనివాస్ గుర్తుకొస్తారని తెలిపారు. ఈ ప్రాజెక్ట్ ప్రారంభం కావడానికి, ముందుకు సాగడానికి త్రివిక్రమ్ సహకారం కీలకమని వెల్లడించారు. తన జీవితంలో త్రివిక్రమ్‌కు ఎప్పటికీ ప్రత్యేక స్థానం ఉంటుందని చెప్పారు. ఈ వ్యాఖ్యలతో పవన్ కళ్యాణ్ అభిమానుల్లో మరోసారి ‘ఓజీ’ సినిమాపై చర్చ మొదలైంది. ఇదే కార్యక్రమంలో త్రివిక్రమ్ దర్శకత్వ ప్రతిభపై కూడా తమన్ తన అభిమానాన్ని వ్యక్తం చేశారు. ముఖ్యంగా విక్టరీ వెంకటేష్, త్రివిక్రమ్ కలయికలో రూపొందుతున్న ‘ఆదర్శ కుటుంబం’ చిత్రానికి పనిచేయడం తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని తెలిపారు. గతంలో ఎన్టీఆర్‌తో కలిసి ‘అరవింద సమేత’ చిత్రానికి పనిచేయాలనే తన కోరిక నెరవేరిందని, ఇప్పుడు వెంకటేష్‌తో త్రివిక్రమ్ చేస్తున్న సినిమాకు సంగీతం అందించడం మరో ప్రత్యేకమైన అనుభవమని పేర్కొన్నారు. వెంకటేష్ నటించిన ‘నువ్వు నాకు నచ్చావ్’ సినిమా తనకు ఎంతో ఇష్టమని తమన్ వెల్లడించారు. ఇప్పటికీ భోజనం చేసే సమయంలో యూట్యూబ్‌లో ఆ సినిమాను చూస్తుంటానని సరదాగా చెప్పారు. ఈ వ్యాఖ్యలు వేదికపై నవ్వులు పూయించాయి. వెంకటేష్, త్రివిక్రమ్ మధ్య ఉండే ప్రత్యేకమైన కెమిస్ట్రీ ‘ఆదర్శ కుటుంబం’ చిత్రంలోనూ ఆకట్టుకుంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఇక ‘ఆదర్శ కుటుంబం’ సినిమా సంగీతం గురించి మాట్లాడుతూ, చిత్రానికి సంబంధించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ పనులు పూర్తయ్యాయని తమన్ తెలిపారు. సినిమాలో దాదాపు ఏడు ప్రత్యేకమైన సంగీత భాగాలు ఉంటాయని, వాటిని ఒరిజినల్ సౌండ్‌ట్రాక్ రూపంలో విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. ఈ సినిమా ప్రేక్షకులకు మంచి అనుభూతిని అందిస్తుందని, బాక్సాఫీస్ వద్ద విజయాన్ని సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మొత్తానికి ఒకే వేదికపై పవన్ కళ్యాణ్ ‘ఓజీ’ గురించి తమన్ చేసిన వ్యాఖ్యలు, త్రివిక్రమ్‌పై ఆయన చూపిన అభిమానం సినీ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. మరోవైపు వెంకటేష్, త్రివిక్రమ్ కాంబినేషన్‌లో వస్తున్న ‘ఆదర్శ కుటుంబం’ సినిమాపై కూడా అంచనాలు కొనసాగుతున్నాయి. ఈ చిత్రానికి తమన్ అందించిన సంగీతం, నేపథ్య సంగీతం తెరపై ఎలాంటి ప్రభావం చూపిస్తాయో చూడాలి.



## కాలేజ్ స్టూడెంట్స్‌కు అదిరిపోయే సలహా!

విక్టరీ వెంకటేష్ తనదైన శైలిలో చేసిన సరదా వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో ఆసక్తికరంగా మారాయి. కాలేజ్ జీవితంలో క్లాసులు బంక్ కొట్టడం కూడా ఒక ప్రత్యేకమైన అనుభవమంటూ ఆయన చేసిన కామెంట్స్ విద్యార్థులను ఆకట్టుకున్నాయి. మల్లారెడ్డి యూనివర్సిటీలో నిర్వహించిన ట్రైలర్ లాంచ్ కార్యక్రమంలో పాల్గొన్న వెంకటేష్.. విద్యార్థులతో ముచ్చటిస్తూ తన మాటలతో సందడి చేశారు. కాలేజ్ రోజులు జీవితంలో మళ్లీ తిరిగి రాని అద్భుతమైన సమయమని వెంకటేష్ అన్నారు. విద్యార్థులు తమ నాలుగేళ్ల కాలేజీ జీవితాన్ని ఆనందంగా గడపాలని సూచించారు. క్లాస్‌రూమ్‌లో పాఠాలు నేర్చుకోవడమే కాకుండా, స్నేహితులతో మాట్లాడుతున్నప్పుడు కూడా కొత్త ఆలోచనలు పుడతాయని చెప్పారు. కాఫీ షాపులు, పార్కింగ్ ప్రాంతాలు లేదా స్నేహితులతో గడిపే సమయాల్లో భవిష్యత్తు కలలకు పునాదులు పడతాయని వివరించారు.

డిగ్రీ ఉద్యోగాన్ని సంపాదించిపెట్టవచ్చని, కానీ మంచి వ్యక్తిత్వాన్ని నిర్మించుకోవడం జీవితంలో మరింత ముఖ్యమని వెంకటేష్ పేర్కొన్నారు. ఆయన వ్యాఖ్యలు విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపాయి. అనంతరం వేదిక దిగి నేరుగా విద్యార్థుల మధ్యకు వెళ్లి వారిని పలకరించడంతో ఆడిటోరియం కేరింతలతో మార్మోగింది.దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్, సంగీత దర్శకుడు తమన్‌కు వెంకటేష్ ధన్యవాదాలు తెలిపారు. అక్టోబర్ 30న విడుదల కానున్న తమ సినిమాను థియేటర్లలో చూసి ఆనందించాలని ప్రేక్షకులను కోరారు. కాలేజ్ జీవితంపై వెంకటేష్ చేసిన సరదా వ్యాఖ్యలు ప్రస్తుతం అభిమానుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి.




## ప్రభాస్‌కు విషెస్.. మారుతిపై ఫ్యాన్స్ ట్రోలింగ్!

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా దర్శకుడు మారుతి చేసిన సోషల్ మీడియా పోస్ట్ చర్చనీయాంశంగా మారింది. ప్రభాస్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయనపై ప్రశంసలు కురిపించడంతో కొందరు అభిమానులు స్పందిస్తున్నారు. అయితే ‘ది రాజాసాబ్’ సినిమా నేపథ్యంలో మరికొందరు మారుతిని ట్రోల్ చేస్తున్నారు. అక్టోబర్ 23న ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా పలువురు సినీ ప్రముఖులు, అభిమానులు సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ క్రమంలో మారుతి కూడా ప్రభాస్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ ప్రత్యేక సందేశాన్ని పంచుకున్నారు. ప్రభాస్ వ్యక్తిత్వం, వినయం, కష్టపడే తత్వం తనకు ఎంతో స్ఫూర్తినిస్తాయని ప్రశంసించారు. ఆయన మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అయితే ఈ పోస్ట్‌పై సోషల్ మీడియాలో మిశ్రమ స్పందన కనిపిస్తోంది. ‘ది రాజాసాబ్’ సినిమాపై ఉన్న అంచనాలు, ప్రేక్షకుల స్పందనను ప్రస్తావిస్తూ కొందరు ప్రభాస్ అభిమానులు మారుతిపై విమర్శలు చేస్తున్నారు. సినిమా విషయంలో తమకు ఉన్న అసంతృప్తిని కామెంట్ల రూపంలో వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు, తన హీరోకు శుభాకాంక్షలు చెప్పడంలో తప్పేముందని ప్రశ్నిస్తూ కొందరు మారుతికి మద్దతు తెలుపుతున్నారు. మొత్తానికి ప్రభాస్‌కు మారుతి తెలిపిన శుభాకాంక్షలు సోషల్ మీడియాలో చర్చకు దారితీశాయి. ‘ది రాజాసాబ్’ సినిమా నేపథ్యంలో దర్శకుడిపై వస్తున్న వ్యాఖ్యలు మరోసారి అభిమానుల మధ్య ఆసక్తికర చర్చకు కారణమయ్యాయి.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com